FOR ADS.......
ఆకాంక్ష
CONTACT :
8333818121

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964

విలేకరులు కావలెను
ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ... అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..
సంప్రదించండి...
8333818121
ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష akankshanews.com

ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :177 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 17 - ఫిబ్రవరి - 2026

## విశాఖ కొత్త రైల్వే జోన్‌కు వడివడిగా అడుగులు



విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలు

తుదిదశకు దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ

మూడు డివిజన్లకు పరిమితం కానున్న దక్షిణ మధ్య రైల్వే

అమరావతి : సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలు ఫలితాలనిస్తున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా జోన్ కార్యకలాపాలకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఏప్రిల్ 1 నుంచి నూతన రైల్వే జోన్ పట్టాలెక్కే సంకేతాలు కన్పిస్తున్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే 3 డివిజన్లకే పరిమితం కానుంది.

దక్షిణమధ్య రైల్వే పునర్విభజన ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. కొత్త రైల్వే జోన్ కు అపాయింటెడ్ డేను కేంద్ర ప్రభుత్వం తొందరలోనే ప్రకటించనున్నట్టు తెలిపింది. ఏప్రిల్ 1 నుంచి నూతన మిగతా..2లో

## తిరుమల శ్రీవారి మే నెల దర్శన కోటా..



మే నెల శ్రీవారి దర్శన టికెట్ల కోటా విడుదల షెడ్యూల్

ఫిబ్రవరి 18న ఆర్జిత సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ ప్రారంభం

ఫిబ్రవరి 24న ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల విడుదల

తిరుమల, తిరుపతి గదుల కోటాను కూడా విడుదల చేయనున్న టీటీడీ

వివిధ తేదీల్లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండనున్న టికెట్లు

అమరావతి : తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ప్రకటన చేసింది. 2026 మే నెలకు సంబంధించిన వివిధ దర్శనాలు, ఆర్జిత సేవలు, గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసేందుకు తేదీల వారీగా షెడ్యూల్‌ను ప్రకటించింది. భక్తులు ఈ తేదీలను గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. మిగతా..2లో

## ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

### 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా



- రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండలను దక్కించుకున్న కాంగ్రెస్
- కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ విజయం
- జనగాం, తొర్రూర్, క్యాతనపల్లి, జహీరాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

హైదరాబాద్: తెలంగాణలో ఐదు కార్పొరేషన్లను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. బీజేపీ, సీపీఐ పార్టీలు చెరో కార్పొరేషన్‌ను దక్కించుకున్నాయి. రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లను కాంగ్రెస్, కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ, కొత్తగూడెం కార్పొరేషన్‌ను

# రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త



- వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల
- ఇప్పటి వరకు రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు

హైదరాబాద్: రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. వరి బోనస్ బకాయి నిధులను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. దీంతో 2.17 లక్షల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా 2025-26లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రెండు లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధరకు ఈ రూ.500 అదనం. బకాయిల చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

## నల్గొండను దేశం గర్వించేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం



- నల్గొండ మేయర్, డిప్యూటీ మేయర్లకు కోమటిరెడ్డి అభినందనలు
- తన మనసు గర్వంతో నిండిపోయిందని వ్యాఖ్య
- ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తామన్న మంత్రి

హైదరాబాద్ : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లను ఈరోజు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన జీవిత కల అని భావోద్వేగంతో చెప్పుకొచ్చారు. నూతన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. నల్గొండ మిగతా..2లో

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు 9మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు



- మహిళలకు ఆలయ ప్రవేశం అంశంపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం
- తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు

ఢిల్లీ : కేరళలోని శబరిమల ఆలయంతో సహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళల ప్రవేశంపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసును విచారించేందుకు తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

### దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

## రాష్ట్రాలను కలుపుతూ భారీ నెట్‌వర్క్

### దేశమంతా సీసీ కెమెరాల అనుసంధానం

- మాదక ద్రవ్యాల రవాణాకు చెక్
- ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు
- సరిహద్దుల్లో అధునాతన టెక్నాలజీ
- ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవంలో కేంద్ర హోంమంత్రి కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ : డ్రగ్స్ రవాణాను అడ్డుకునేందుకు దేశవ్యాప్తంగా పటిష్ఠమైన 'సీసీటీవీ కెమెరాల నెట్‌వర్క్'ను ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, దశాబ్దాలుగా దేశాన్ని భయపెడుతున్న నక్సలిజం సమస్యకు ఈ ఏడాది మార్చి 31 నాటికి శాశ్వతంగా చరమగీతం పాడబోతున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు భారతదేశ అంతర్గత భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశ యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల మహమ్మారిని సమూలంగా అంతం చేసేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. ఢిల్లీ పోలీసుల 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన భవిష్యత్ కార్యాచరణను వివరించారు. "రాబోయే కొద్ది నెలల్లోనే కొత్త 'జాతీయ భద్రతా నిర్మాణాన్ని' ఏర్పాటు చేస్తాం. దీని ప్రధాన లక్ష్యం మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే. ఇందుకోసం దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక భారీ సీసీటీవీ నెట్‌వర్క్‌ను సృష్టిస్తాం. వీటిని పర్యవేక్షించడానికి మిగతా..2లో

## ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో ప్రారంభించిన ప్రధాని మోదీ



- ఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరైన ప్రధాని మోదీ
- భారత్ మండపం, సుష్మాస్వరాజ్ భవన్, అంబేడ్కర్ సెంటర్‌లో నిర్వహణ
- ఢిల్లీ: ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు హాజరైన 20 దేశాల అధినేతలు

ఢిల్లీ : ఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పోను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎక్స్‌పోలో పాల్గొన్న స్టార్టప్‌లతో మోదీ సంభాషించారు. వివిధ స్టాళ్లను సందర్శించిన ప్రధాని, ఎక్స్‌పోలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులతో మాట్లాడారు. ఏఐ పర్యావరణ వ్యవస్థలో అంతర్జాతీయ సహకారాన్ని ప్రదర్శించే 600 కి పైగా అధిక సంభావ్య స్టార్టప్‌లు, 13 దేశ పెవిలియన్‌లు ఎక్స్‌పోలో పాల్గన్నాయి. ప్రపంచ సాంకేతిక సంస్థలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అంతర్జాతీయ భాగస్వాములను ఈ ఎక్స్‌పో ఒకచోట చేర్చింది.

## బిల్ గేట్స్‌కు గన్నవరంలో మంత్రి లోకేశ్ ఘన స్వాగతం



- ప్రత్యేక విమానంలో గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకున్న బిల్ గేట్స్
- బిల్ గేట్స్ కు స్వాగతం పలికిన మంత్రులు నారా లోకేశ్, అనిత, అచ్చెన్నాయుడు సత్యకుమార్ యాదవ్
- సచివాలయం వద్ద స్వాగతం పలకనున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి : గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్

### హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు..

## అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్ట్..

అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌తో పాటు మొత్తం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

గచ్చిబౌలి ప్రాంతంలో ఈగల్ టీమ్ నిర్వహించిన తనిఖీల్లో కొకైన్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టైంది.

ట్రావెల్స్ బస్సులను వినియోగించడం ద్వారా అనుమానం రాకుండా డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చినట్లు వెల్లడైంది.



హైదరాబాద్, ఫిబ్రవరి16 : హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ అక్రమ రవాణా మరోసారి బయటపడింది. గచ్చిబౌలి ప్రాంతంలో ఈగల్ టీమ్ నిర్వహించిన తనిఖీల్లో కొకైన్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టు రట్టైంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా పోలీసులు 32 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్‌తో పాటు మొత్తం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో భాగంగా పోలీసులు కొండాపూర్‌లోని వెంకటరమణ రెసిడెన్సీలో సోదాలు నిర్వహించారు. అక్కడ డ్రగ్స్ నిల్వ చేసి, నగరంలో వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రగ్స్‌ను గోప్యంగా నిల్వ చేసి, అవసరమైనప్పుడు

### ఏపీకి విచ్చేసిన గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక

## ఛైర్మన్ బిల్ గేట్స్

అమరావతిలోని సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎంలతో భేటీ

గేట్స్ కు మంత్రులను పరిచయం చేసిన చంద్రబాబు



అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మైక్రోసాఫ్ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ సమావేశమయ్యారు. ఈ ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న బిల్ గేట్స్... అక్కడి నుంచి నేరుగా అమరావతిలోని సచివాలయానికి చేరుకున్నారు. సెక్రటేరియట్ వద్ద ఆయనకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. అనంతరం బిల్ గేట్స్ కు మంత్రులను చంద్రబాబు పరిచయం చేశారు. ఆ తర్వాత వీరితో బిల్ గేట్స్ బృందం సమావేశమయింది. ఈ సమావేశానికి సంబంధించిన ఫోటోలు ఇవిగో.

# విశాఖ కొత్త రైల్వే జోన్‌కు వడివడిగా అడుగులు

**మొదటి పేజి తరువాయి**

రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభింపజేయాలని రైల్వేశాఖ భావిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలకు సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. ఇది అమల్లోకి వస్తే 6 డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లకే పరిమితం కానుంది. మిగతా విజయవాడ, గుంటూరు, గుంతకల్లుతో పాటు తూర్పు కోస్తా జోన్‌లోని కొంతభాగంతో కలిపి కొత్తగా ఏర్పడే విశాఖపట్నం డివిజన్‌తో కలిపి దక్షిణ కోస్తా జోన్ ఏర్పాటుకానుంది. ఇంత తక్కువ సమయం సరిపోతుందా : కొత్త జోన్‌కు ఏప్రిల్ 1 అపాయింటెడ్ డే. దీనికి ఇంకా 6 వారాలే సమయం ఉంది. కొత్త జోన్ ప్రారంభానికి ఇంత తక్కువ సమయం సాంకేతికంగా సరిపోతుందా అన్న కోణంలోనూ రైల్వే బోర్డులో చర్చ జరిగినట్లు తెలిసింది. సాధ్యాసాధ్యాలపై కొద్దిరోజుల్లోనే స్పష్టత వస్తుందని నెలాఖరుకల్లా కొత్త జోన్ అపాయింటెడ్ డేపై నోటిఫికేషన్ రావచ్చంటూ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం అధికారులు అంటున్నారు. డివిజన్ల వారీగా విభజన, సరిహద్దుల్లో మార్పులు చేర్పులు, ఆదాయ వ్యయాలు, రైళ్ల నిర్వహణ సహా పలు అంశాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక రైల్వేబోర్డుకు 9 నెలల క్రితమే చేరింది. ఏపీ విభజన చట్టంలో విశాఖ కేంద్రంగా కొత్తగా రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నట్లు అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. నూతన జోన్‌కు కేంద్ర మంత్రి వర్గం 2025 ఫిబ్రవరిలో ఆమోదం తెలిపింది. కొన్ని నెలల నుంచే కొత్త జోన్ జీఎం, విభాగాధిపతులను బోర్డు దశల వారీగా నియమిస్తోంది. డివిజన్లలో మార్పులు, చేర్పులు : నూతన జోన్ ఏర్పాటుతో ఇప్పటి వరకు ఉన్న డివిజన్లలో కొన్ని మార్పులు, చేర్పులు జరగనున్నాయి. గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రాయచూరు-వాడి 108 కిలోమీటర్ల సెక్షన్ సికింద్రాబాద్ రైల్వే డివిజన్‌కు పరిమితం కానుంది. విష్ణుపురం-పగిడిపల్లి, విష్ణుపురం-జాన్‌పహాడ్ 142 కిలోమీటర్ల



మార్గాలు ప్రస్తుతం గుంటూరు డివిజన్‌లో ఉండగా అవి సికింద్రాబాద్‌కు బదిలీ కానున్నాయి. 46 కిలోమీటర్ల మోటుమర్రి-కొండపల్లి మార్గం సికింద్రాబాద్ నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళ్లనుంది. ఇదిలా ఉండగా మరోవైపు సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి 54 ఎకరాలు కేటాయించారు. పరిపాలన భవనానికి ఖర్చు రూ.192 కోట్లుగా అంచనా. ఈ నిర్మాణంలో దాదాపు 12 అంతస్తులు ఉండనున్నాయి. దీని విస్తీర్ణం లక్ష చదరపు అడుగులుగా ఉంది.

# ముగిసిన బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటన

**మొదటి పేజి తరువాయి**

కోసం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. ఏపీలోని వివిధ ప్రాజెక్టులకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి: వైద్యరంగంలో తెచ్చిన మార్పులు-సాధించిన ఫలితాలపైనా ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బిల్ గేట్స్ అమరావతి పర్యటన చారిత్రాత్మకమన్న సీఎం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఈ పర్యటన దోహదం చేస్తుందని అన్నారు. నాడు మైక్రోసాఫ్ట్ రాకతో ఐటీ రంగంలో హైదరాబాద్ మేటిగా నిలబడిందని తెలిపారు. ఏపీలో అన్ని వనరులు ఉన్నాయి, ఇప్పుడు సంపద సృష్టి జరగాల్సి ఉందని అన్నారు. బిల్ గేట్స్ సహకారంతో వివిధ రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని వెల్లడించారు. 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమన్న సీఎం ఇందుకు సాంకేతికతని విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. అమరావతి డిజైన్ అండ్ ఫౌండ్రీ, క్వాంటం వ్యాలీగా ఆవిష్కృతం అవుతుందన్నారు. డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లును తీర్చిదిద్దుతున్నామన్నారు.

### యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్

ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నామన్నారు. విద్యారంగంలో అధునిక విధానాలను పాటిస్తున్నాం, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు చేస్తున్నామన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమం కోసం సాంకేతిక సాయం తీసుకుంటున్నామన్నారు. మెరుగైన ప్రజారోగ్య సేవలు అందించేందుకు అత్యున్నత స్థాయి నిపుణులతో సలహా మండలి ఏర్పాటు చేశామని వివరించారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ విధానం ప్రజలకు ముందస్తుగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో సాంకేతిక వినియోగాన్ని టెక్ దిగ్గజం బిల్ గేట్స్ ప్రశంసించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని మెచ్చుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని కొనియాడారు. అమరావతి రాజధాని నిర్మాణంలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక గ్రేట్ వర్క్ అని కితాబిచ్చారు.

బిల్ గేట్స్ కితాబు: అమరావతిలోని రియల్‌టైం గవర్నెన్స్ కేంద్రం -ఆర్టీజీఎస్ ను గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్ గేట్స్ పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన గేట్స్‌కు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ సాదర స్వాగతం పలికారు. హాలో ఫ్రెండ్! హౌ ఆర్ యూ ? అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును బిల్ గేట్స్ ఆత్మీయంగా పలకరించారు. తాను బాగున్నానని, మీరెలా ఉన్నారంటూ బిల్ గేట్స్ ను చంద్రబాబు ఆ తర్వాత మంత్రివర్గ సహచరులు, సీఎంఓ అధికారులను పరిచయం చేశారు. అక్కడి నుంచి ఆర్టీజీఎస్ కేంద్రానికి వెళ్లారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానించామని బిల్‌గేట్స్‌కు సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు సులభతరం చేయడం బాగుందని గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.౦ ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్నిసేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు చంద్రబాబు తెలిపారు.

'గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుంది, గ్రేట్ వర్క్ ': ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తూ కీలక సూచీల ద్వారా జీఎస్ డీపీ వృద్ధిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్ గేట్స్ ప్రశ్నించగా బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, క్యూఆర్ కోడ్‌తో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. పన్ను వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందన్న గేట్స్ ప్రశంసించగా జీఎస్టీ విధానంతో దేశంలో పన్నుల వసూళ్లు కూడా గణనీయంగా పెరిగిందని సీఎం చెప్పారు. ఇదే సమయంలో ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్ గేట్స్ అడగ్గా చంద్రబాబు వివరించారు. రాజధానిలో 30శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందని, గ్రేట్ వర్క్ అని బిల్ గేట్స్ మెచ్చుకున్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ సేవల వివరణ: ఇక గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి బిల్ గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి పరీక్షల వివరాలు ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డుల ఆధారంగా లైఫ్ స్టైల్ , ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం చెప్పారు. "దట్స్ నైస్" అంటూ సంజీవని ప్రాజెక్టు అమలును బిల్ గేట్స్ ప్రశంసించారు. డయాగ్నోస్టిక్ సేవలు తక్కువ వ్యయానికే అందితే పేదలకు వెసులుబాటు ఉంటుందని గేట్స్ అభిప్రాయపడ్డారు.

## దేశవ్యాప్తంగా సీసీటీవీలు ఏర్పాటు

# రాష్ట్రాలను కలుపుతూ భారీ నెట్‌వర్క్

**మొదటి పేజి తరువాయి**

'ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్స్' ఏర్పాటు చేస్తాం. ఈ నిఘా వ్యవస్థకు చట్టపరమైన రక్షణ కూడా కల్పిస్తాం. దీనివల్ల డ్రగ్స్ నేరాలను రియల్ టైమ్‌లో పసిగట్టడం సులభమవుతుంది" అని షా అన్నారు.

సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత

కేవలం అంతర్గత భద్రతే కాదు, సరిహద్దుల రక్షణపైనా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని షా తెలిపారు. "దేశంలోని ప్రతి భూ సరిహద్దులో భద్రతా ఏర్పాట్లను ఆధునీకరిస్తాం. నిఘా వ్యవస్థలను అప్‌గ్రేడ్ చేస్తాం. ఫెన్సింగ్ (కంచె), ఇతర మౌలిక సదుపాయాలను బలపరుస్తాం. చొరబాట్లను అడ్డుకునేందుకు సరిహద్దు భద్రతా దళాల మధ్య సమన్వయం పెంచుతాం. అక్రమ ప్రవేశాలకు ఇక ఆస్కారం ఉండదు" అని తెలిపారు. అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టుల ఏరివేతపై స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు. "నక్సలిజం ఒకప్పుడు దేశంలోని 11 రాష్ట్రాలకు విస్తరించి పెద్ద సవాలుగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ సమస్య దాదాపుగా కొలిక్కి వచ్చింది. ప్రభావిత ప్రాంతాలను మావోయిస్టుల చెర నుంచి విడిపించడానికి మనం చాలా దగ్గరగా ఉన్నాం. మార్చి 31, 2026 నాటికి దేశం నుంచి మావోయిస్టు హింసను పూర్తిగా తుడిచిపెట్టేస్తాం. ఇది మన భద్రతా దళాలకు దక్కే అతిపెద్ద విజయం." అని అన్నారు.

భద్రతకు స్వర్ణయుగం



గత 12 ఏళ్ల కాలాన్ని (2014 నుంచి 2026 వరకు) భారత అంతర్గత భద్రత చరిత్రలో 'స్వర్ణయుగం'గా అమిత్ షా అభివర్ణించారు. "2014కు ముందు దేశాన్ని కశ్మీర్ సమస్య, ఈశాన్య రాష్ట్రాల్లో అలజడి, మావోయిస్టు హింస అనే మూడు ప్రధాన సమస్యలు వేధించేవి. ఈ మూడు సమస్యలు 3-4 దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడించాయి. కానీ ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు మారాయి. కశ్మీర్, ఈశాన్య భారతం, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో హింస 80 శాతం తగ్గింది. ఈ మూడు ప్రాంతాలు పూర్తిగా హింస రహితంగా మారే రోజు ఎంతో దూరంలో లేదు" అని వివరించారు.

### ఈశాన్యంలో శాంతి పవనాలు

ఈశాన్య రాష్ట్రాల్లో వచ్చిన మార్పులను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రస్తావించారు. "అక్కడ 10,000 మందికి పైగా యువకులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. 20కి పైగా శాంతి ఒప్పందాల ద్వారా ఆ ప్రాంతంలో ప్రశాంతత నెలకొల్పగలిగాం" అని అన్నారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాల స్థానంలో తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాల గురించి కూడా షా మాట్లాడారు. "రాబోయే కాలంలో ఈ చట్టాలను సంపూర్ణంగా, సమర్థవంతంగా అమలు చేయడంపైనే హోం శాఖ దృష్టి సారిస్తుంది. పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు దీనిపై పూర్తి స్థాయి శిక్షణ ఇస్తున్నాం. వారికి కావాల్సిన పరికరాలను సమకూరుస్తున్నాం" అని చెప్పారు.

### ఢిల్లీ పోలీసులకు ప్రశంసలు

దేశ రాజధాని రక్షణలో ఢిల్లీ పోలీసులు చూపుతున్న తెగువను మంత్రి అమిత్ షా కొనియాడారు. "పార్లమెంట్ దాడి కేసు అయినా, ఎర్రకోట సమీపంలో బాంబు పేలుడు అయినా, ఢిల్లీ పోలీసులు సమర్థవంతంగా పనిచేశారు. క్లిష్టమైన కేసులను ఛేదించడంలో వారి నైపుణ్యం అద్భుతం. దేశ రక్షణలో వారు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. 2029 నాటికి దేశం ఎదుర్కొంటున్న అన్ని భద్రతా సవాళ్లను సమన్వయంతో, నిరంతర కృషితో అధిగమిస్తాం" అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

# పురపోరులో సత్తా చాటిన బీఆర్‌ఎస్

సాధారణంగా మున్సిపల్ ఎన్నికల్లో ఎప్పుడూ అధికార పక్షానికి మంచి మెజారిటీ లభిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విడిపోయిన తర్వాత కూడా సాధారణంగా మున్సిపాలిటీ ఎన్నికలు అసెంబ్లీ ఎన్నికలు మూడు నాలుగు ఏండ్ల గడువు ఉన్న సమయంలోనే జరిగాయి. ఇప్పుడు కూడా తెలంగాణలో కాంగ్రెస్‌కు ఇంకా 33 నెలల పదవీ కాలం ఉన్న సమయంలోనే మున్సిపల్ ఎన్నికలు జరిగాయి.తెలంగాణ వార్తలు అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా చాలా గడువు ఉండడం వల్ల సహజంగా అధికార పక్షానికి ఫలితాలు అనుకూలంగా ఉండాలి. అయితే గతంలో అధికారంలో ఉన్న పార్టీలకు లభించిన విజయం కన్నా ఈ సారి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన మెజారిటీ తగ్గింది. మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ సాధారణ ఎన్నికల్లో ఓడిపోయిన సందర్భాలే ఎక్కువ. 2020లో తెలంగాణలోని 120 మున్సిపాలిటీలు, 9 మున్సిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు జరిగితే అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 110 మున్సిపాలిటీల్లో, ఏడు మున్సిపల్ కార్పొరేషన్‌లలో విజయం సాధించింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ నాలుగు మున్సిపాలిటీల్లో మాత్రమే గెలుపొందింది. ఒక్క కార్పొరేషన్ కూడా దక్కించుకోలేదు. అంటే మొత్తం సీట్లల్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కేవలం మూడు శాతం సీట్లు మాత్రమే గెలిచింది. మూడేండ్లు గడిచిన తర్వాత 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. మున్సిపాలిటీల్లో మూడు శాతం సీట్లు సాధించడం అనేది, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి అడ్డంకి కాలేదు. అదే విధంగా వార్డుల విషయంలోనూ ఇలానే ఉన్నది. అప్పుడు బీఆర్ఎస్ 1686 వార్డుల్లో విజయం సాధిస్తే కాంగ్రెస్ 569 వార్డుల్లో మాత్రమే విజయం సాధించింది. 2020లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ సాధించిన ఫలితాలతో పోలిస్తే ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ చాలా ఎక్కువ సీట్లు సాధించింది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ 1347 వార్డుల్లో విజయం సాధిస్తే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 723 వార్డుల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 52 శాతం వార్డుల్లో గెలిస్తే బీఆర్ఎస్ 30 శాతం వార్డులను కైవసం చేసుకున్నది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సగం సీట్లు సాధించినా మున్సిపాలిటీ ఎన్నికల్లో మాత్రం 261 వార్డులు, దాదాపు 10 శాతం సీట్లు మాత్రమే సాధించి, మూడో స్థానానికి పరిమితమైంది. మున్సిపాలిటీ ఎన్నికలు జరిగిన మూడేండ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు భిన్నంగా రావడం



అనేక సార్లు జరిగింది. ఎక్కు వసార్లు మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలకు పూర్తి భిన్నంగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. 2004లో శాసనసభ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2005లో మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మున్సిపాలిటీల సంఖ్య 96, వీటిలో టీడీపీ 20 మున్సిపాలిటీల్లో మాత్రమే గెలిచే అవకాశం ఉన్నది అని ఎన్నికలకు ముందు టీవీ 9 సర్వే ప్రకటించింది. కాంగ్రెస్‌తో కుమ్మక్కు అయి ఈ సర్వే ప్రకటించారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆరోపణలు చేశారు. తమ పార్టీ కార్యక్రమాలకు టీవీ 9ను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. టీవీ 9 బాధ్యులు ఎన్టీఆర్ భవన్‌కు వెళ్లి, చంద్రబాబుకు వివరణ ఇచ్చుకున్నారు. వాస్తవానికి అధికార పక్షానికి ఉండే అనుకూలత, శాసనసభ్యులకు ఉండే ఓటింగ్, వంటి కారణాలతో టీడీపీకి ఆ 20 కూడా రావని గట్టి నమ్మకం ఉండే ది. ఇక ఫలితాలు వచ్చాక చూస్తే చివరకు ఆ 20 కూడా రాలేదు. టీడీపీ కేవలం ఎనిమిది మున్సిపాలిటీల్లో మా త్రమే గెలిచింది. 82 మున్సిపాలిటీలతోపాటు తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్‌లను కాంగ్రెస్ గెలుచుకున్నది. వైఎస్ఆర్ నాయకత్వంలో మున్సిపాలిటీల్లో 90 శాతం విజయం సాధించిన కాంగ్రెస్‌కు.. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 294 అసెంబ్లీ సీట్లకుగాను 156 అసెంబ్లీ సీట్లు, 36.56 శాతం ఓట్లు మాత్రమే లభించాయి. టీడీపీకి 92 సీట్లు లభించాయి. ఉమ్మడి రాష్ట్రంలో 92 సీట్లతో బలమైన ప్రతిపక్షం ఉండడం అదే మొదటి సారి. అంతకుముందు ఎప్పుడూ ప్రతిపక్షానికి అన్ని సీట్లు లేవు. 1981-82లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్, ఆ ఎన్నికల తర్వాత పుట్టిన టీడీపీ చేతిలో అసెంబ్లీ ఎన్నికల్లో మట్టికరిచింది. ఉమ్మడి రాష్ట్రంలో 1987లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో అప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ మెజారిటీ సీట్లలో గెలిచింది. 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయి కాంగ్రెస్ గెలిచింది. చెన్నారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ 183 సీట్లతో అధికారంలోకి వచ్చింది. 2021లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో జగన్ నాయకత్వంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్లిన్ స్వీప్ చేసింది. మున్సిపాలిటీ ఎన్నికలకు సంబంధించి అదొక రికార్డ్. 95 శాతం సీట్లు ఒక్క వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకే వచ్చాయి. 1500 వార్డుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలిస్తే టీడీపీ వంద వార్డులకు పరిమితమైంది. 75 మున్సిపాలిటీలు, 12 మున్సిపల్ కార్పొరేషన్‌లలో వైఎస్ఆర్ కాంగ్రెస్ విజయం సాధించింది. రెండేండ్ల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేవలం 11 అసెంబ్లీ సీట్లు సాధించి ప్రతిపక్ష హోదా కూడా పొందలేక పోయింది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు గడిచిపోయింది. రెండేండ్లలోనే ఐదేండ్లకు సరిపోయేంత వ్యతిరేకత మూటకట్టుకున్నది. మున్సిపాలిటీ ఎన్నికల్లో 95 శాతం సీట్లు సాధించిన వారు కూడా ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన ఎన్నికల చరిత్ర ఉన్నది. ఇప్పుడు తెలంగాణలో 1347 వార్డుల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తే, బీఆర్ఎస్ 716 వార్డుల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ అధికారానికి ఇంకా 33 నెలల సమయం ఉన్నది. బీఆర్ఎస్ పుంజుకోవడానికి ఈ సమయం సరిపోతుంది. తెలంగాణలోఉత్కంఠ రేకెత్తించిన పురపోరులో ఇక ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సాధించిన ఫలితాలు చాలా మెరుగైనవే. గతంలో అధికార పార్టీలు పురపోరులో దక్కిం చుకున్న స్థానాలతో పోల్చితే కాంగ్రెస్ కైవసం చేసుకున్నవి చాలా తక్కువేనని స్పష్ట మవుతున్నది. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ 1347 వార్డుల్లో విజయం సాధిస్తే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 723 వార్డుల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ 52 శాతం వార్డుల్లో విజయం సాధిస్తే బీఆర్ఎస్ 30 శాతం వార్డులను కైవసం చేసుకుంది. బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో సగం సీట్లు సాధించినా మున్సిపాలిటీల్లో మాత్రం 261 వార్డులతో దాదాపు 10 శాతం సీట్లు మాత్రమే సాధించింది.

**మొదటి పేజి తరువాయి**

## నల్గొండను దేశం గర్వించేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

తన జన్మభూమి అని కోమటిరెడ్డి అన్నారు. నల్గొండలోని ప్రతి గల్లీ తన గుండెచప్పుడు అని చెప్పారు. ఈరోజు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం చేస్తుంటే... తన మనసు ఎంతో గర్వంతో నిండిపోయిందని అన్నారు. నల్గొండను దేశం గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. "రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరేలా చూడడమే నా బాధ్యత" అని మంత్రి ప్రకటించారు. "నాటి ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుంచి నేటి స్మార్ట్ సిటీ నిర్మాణం వరకు... మీ కోమటిరెడ్డి ఎప్పుడూ మీ తోడుగానే ఉంటాడు. మనందరం కలిసి నవ నల్గొండను నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు.

## తిరుమల శ్రీవారి మే నెల దర్శన కోటా..

### తేదీల వారీగా కోటా విడుదల వివరాలు:

ఫిబ్రవరి 18: సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ డిప్ ప్రక్రియ ఫిబ్రవరి 18న ఉదయం 10 గంటలకు మొదలవుతుంది. భక్తులు ఫిబ్రవరి 20 ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. డిప్‌లో టికెట్లు పొందిన వారు ఫిబ్రవరి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బులు చెల్లించి, టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.ఫిబ్రవరి 21: కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్ల కోటాను అందుబాటులోకి తేనున్నారు. ఫిబ్రవరి 23: ఈ రోజున మూడు వేర్వేరు కోటాలను విడుదల చేయనున్నారు. ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఫిబ్రవరి 24: భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలలో గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. ఫిబ్రవరి 27: ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ తెలిపింది.

## మతపరమైన ప్రదేశాల్లో మహిళల వివక్ష కేసు

## 9మంది న్యాయమూర్తులతో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు

ఈ విచారణను ధర్మాసనం ఏప్రిల్ 7న ప్రారంభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం చెప్పింది. ఇది ఏప్రిల్ 22 నాటికి ముగిసే అవకాశం ఉందని పేర్కొంది. మహిళల ప్రవేశంపై నిషేధానికి సంబంధించి మార్చి 14లోపు లిఖితపూర్వక వాదనలను సమర్పించాలని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు, ఆలయ నిర్వాహకులకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. శబరిమలతో పాటు మసీదులు, దర్గాలోకి మహిళల ప్రవేశంపై కూడా విచారించనుంది. అలాగే ఇతరులను పెళ్లి చేసుకున్న పార్సీ మహిళలకు మతపరమైన ప్రాంగణాల్లోకి ప్రవేశం లేకపోవండ వంటి అంశాలపై పరిగణనలోకి తీసుకుంది. అయితే నిర్ణయించిన షెడ్యూల్ కు కట్టుబడి ఉండాలని అన్ని పక్షాలకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. 2019లో అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బోబ్డే ఏర్పాటు చేసిన 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం సమీక్ష పిటిషన్ల నిర్వహణను ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. అయితే కొవిడ్ కారణంగా ఈ అంశంపై విచారణలను అకస్మాత్తుగా రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మరో కొత్త ధర్మాసనంతో దీనిపై విచారణ జరపనున్నట్లు వెల్లడించారు.

## ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

## 11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

సీపీఐ దక్కించుకున్నాయి. రామగుండం, మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్గొండలలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చింది. నిజామాబాద్ కార్పొరేషన్ బీజేపీకి అవకాశాలు ఉన్నప్పటికీ, మజ్లిస్ పార్టీ మద్దతుతో దీనిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్‌గా 49వ వార్డు కార్పొరేటర్ ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా మజ్లిస్ పార్టీ 54వ వార్డు కార్పొరేటర్ సల్మా తహసీన్ ఎన్నికయ్యారు.

### 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా

కోరం లేకపోవడం వల్ల 11 మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ ఎన్నిక వాయిదా పడింది. జనగాం, తొర్రూరు, ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్ నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్ మున్సిపాలిటీలలో ఎన్నిక వాయిదా పడినట్లు అధికారులు ప్రకటించారు.

## బిల్ గేట్స్‌కు గన్నవరంలో మంత్రి లోకేశ్ ఘన స్వాగతం

ఆయనకు మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, కె.అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌తో పాటు జిల్లా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బిల్ గేట్స్‌తో పాటు అధికారులు, మంత్రుల బృందం సచివాలయానికి బయల్దేరారు. ఈ పర్యటనలో బిల్ గేట్స్‌తో పాటు ఫౌండేషన్‌కు చెందిన ఆరుగురు ప్రతినిధుల బృందం కూడా సచివాలయానికి రానుంది. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తో వారు సమావేశమవుతారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్)ను బిల్ గేట్స్ సందర్శించనున్నారు. ఆర్టీజీఎస్ ద్వారా అమలవుతున్న విధానాలు, అందుతోన్న ఫలితాలను సీఎం చంద్రబాబు గేట్స్‌కు వివరించనున్నారు. అనంతరం సీఎం, మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు బిల్ గేట్స్ బృందంతో సమావేశమై.. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అమలు చేస్తున్న ప్రాజెక్టులను మరింత విస్తరించే అంశంపై కీలక చర్చలు జరపనున్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు.. అంతరాష్ట్ర డ్రగ్ పెడ్లర్ అరెస్ట్..

పోలీసుల విచారణలో ఈ ముఠా డ్రగ్స్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ద్వారా రవాణా చేస్తున్నట్లు బయటపడింది. ఈ విధంగా రవాణా చేయడం ద్వారా పోలీసులు గుర్తించకుండా ఉండాలని ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ట్రావెల్స్ బస్సులను వినియోగించడం ద్వారా అనుమానం రాకుండా డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చినట్లు వెల్లడైంది. ఈ ముఠా గ్రాముకు రూ.7,000కు కొకైన్ కొనుగోలు చేసి, నగరంలో గ్రాముకు రూ.12,000కు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా భారీ లాభాలు పొందుతున్నట్లు విచారణలో తేలింది. నగరంలోని ఐటీ ఉద్యోగులు, యువత ప్రధానంగా ఈ డ్రగ్స్ వినియోగదారులుగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. డ్రగ్స్ సరఫరా కోసం ముఠా ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా వాట్సాప్ కాల్స్ ద్వారానే వినియోగదారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఫోన్ కాల్స్ చేయడం లేదా ప్రత్యక్షంగా కలవడం చేయకుండా.. వాట్సాప్ కాల్స్ ద్వారా మాత్రమే ఆర్డర్లు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

డెలివరీ కోసం డెడ్ డ్రాప్ పద్ధతి..

డ్రగ్స్ డెలివరీ కోసం డెడ్ డ్రాప్ పద్ధతిని ఉపయోగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ విధానంలో డ్రగ్స్‌ను ఒక నిర్దిష్ట ప్రాంతంలో వదిలి, వినియోగదారులకు ఆ లొకేషన్‌ను తెలియజేస్తారు. వినియోగదారులు అక్కడికి వెళ్లి డ్రగ్స్‌ను తీసుకెళ్తారు. ఈ విధానం ద్వారా సరఫరాదారులు, వినియోగదారులు ప్రత్యక్షంగా కలవకుండా ఉండటం వల్ల పోలీసులు గుర్తించడం కష్టమవుతుంది. మరో కీలక అంశం ఏంటంటే, ముఠా సభ్యులు తమ బ్యాంక్ అకౌంట్లను వినియోగించకుండా, స్నేహితుల బ్యాంక్ అకౌంట్లలో డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా తమ అసలు గుర్తింపును దాచడానికి ప్రయత్నించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులకు డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారు కొకైన్ వినియోగించినట్లు నిర్ధారణ అయింది. ఈ కేసులో ఇప్పటివరకు 15 మంది డ్రగ్స్ వినియోగదారులను పోలీసులు గుర్తించారు. వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## సేరూ అప్పు కట్టేస్తా! - రెండేళ్ల క్రితం

## కుదవపెట్టుకున్న నగలు ఇచ్చేయవా!

### పుత్తడి ధర భారీగా పెరగడంతో కొత్త సమస్య ప్రారంభం

### ఏళ్ల కిందట తాకట్టు బంగారాన్ని విడిపించుకోవాలని వినియోగదారుల పాట్లు

### తాకట్టు వివాదాలతో పోలీసుల వద్దకు చేరుకున్న వివాదాలు

ఢిల్లి : రష్యా-యుక్రెయిన్ యుద్ధం పుణ్యమా, మారిన అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ భారీగా పెరిగింది. డాలర్లకు బదులు ప్రపంచ దేశాలు పుత్తడి కొనుగోళ్లు ప్రారంభించాయి. ఫలితంగా ఏడాది గోల్డ్ రేట్ డబుల్ అయింది. దీంతో సామాన్య ప్రజలు పసిడి తీసుకోవాలంటే హడలిపోతున్నారు. ఉన్న బంగారాన్ని జాగ్రత్తగా పరుచుకుంటున్నారు. గతంలో వివిధ కారణాల వల్ల తాకట్టుపెట్టి వదిలేసుకున్న బంగారం గురించి ఆరా తీయడం మొదలు పెట్టారు. అప్పట్లో కొందరు బంగారం తాకట్టు పెట్టి ఆర్థిక ఇబ్బందుల వల్ల డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. తీసుకున్న అప్పు కంటే ఇప్పుడు బంగారం విలువ భారీగా పెరిగి పోవడంతో మళ్లీ ఇప్పుడు ఆ డబ్బులు ఇస్తామని తమ నగలను తిరిగి ఇచ్చేయమని కొందరు తాకట్టు వ్యాపారుల వద్దకు వెళ్తున్నారు. అయితే ఇక్కడే సమస్య మొదలవుతోంది. ఏళ్ల క్రితం ఇచ్చిన నగలకు వడ్డీ, అసలు కట్టేస్తామని దుకాణాలు, ఆఫీసుల వద్దకు వెళ్లితే వాళ్లు తాకట్టు వ్యాపారులు షాకిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆ నగలను వెనక్కి తీసుకోలేరన్న నమ్మకంతో వ్యాపారులు అప్పుడే దాన్ని విక్రయించడం, కరిగించేసి బిస్కెట్లు చేయించుకున్నారు. నగరంలో ఇటీవల ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పరిష్కారం కాకపోవడంతో ఠాణాలకు : హైదరాబాద్ లోని చార్మినర్ , సికింద్రాబాద్ , ఖైరతాబాద్ పరిధిలో బంగారం దుకాణాలు, ఆభరణాల తయారీ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ వ్యాపారులు ఇలా నగలు తాకట్టు పెట్టుకొని డబ్బులు ఇస్తుంటారు. ఏళ్లుగా ఈ దందా నడుస్తోంది.

# సంపాదకీయం

## అసలు ఊహించామా ఇంతమంది పాఠకులను!

2022 వరకూ తెలుగు సాహిత్య స్థితిగతులు బయట ప్రపంచం దృష్టిలో పెద్ద చడీచప్పుడు లేకుండా ఉండేవి. ఉన్న కొద్దిమంది రచయితలో వారిలో వారు సాహిత్యాన్ని గురించి, రచనలను గురించి చర్చించుకుంటూ ఉండేవారు. ఒకరు రాసింది ఇంకొకరు చదవరనీ, సాహిత్యం పట్ల యువతలో ఆసక్తి సన్నగిల్లిపోతోందనీ రకరకాలుగా మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ పరిస్థితిని మార్చడానికి తోచిన పద్ధతిలో కొంతమంది సాహిత్యవేత్తలు, ప్రభుత్వేతర సంస్థలు ప్రయత్నాలు చేస్తూండేవి. నవలల పోటీలు నిర్వహించడం, ఉత్తమ కథలను ఎంపిక చేసి సంచికలు తీసుకురావడం వగైరా ప్రయత్నాలు అందులో భాగంగా ఉండేవి. కానీ, ఇవేమీ ఆ కాస్త సాహిత్యలోకాన్నీ దాటుకుని పుస్తకాలు ముట్టుకోని జనాలపై ప్రభావం చూపించేవి కాదు. ఎవరైనా పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపించినా ఇళ్ళలో పెద్దవాళ్ళ నుంచి కాలేజీ లెక్చరర్ల వరకూ ప్రతీవారూ ఇంగ్లీష్ పుస్తకాలు చదవమని ప్రోత్సహించేవారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివితే కనీసం ఇంగ్లీష్ అయినా నేర్చుకోవచ్చు అని ఉచిత సలహాలు వచ్చేవి. ఇక క్రమేపీ డిజిటల్ కంటెంట్, అందులోనూ రీల్స్, షార్ట్స్ వంటివి ప్రాచుర్యం చెందుతూ ఉండడంతో అసలంటూ పుస్తకాలకే చోటు తగ్గిపోతున్న ప్రపంచంలో తెలుగు పుస్తకాలకు కాలం చెల్లిపోయినట్టే అందరూ భావించారు. మొత్తంగా, ఒక పుస్తకం 2000 నుంచి 4000 వేల కాపీలు విడుదలైన కొద్ది సంవత్సరాల్లో అమ్మగలిగితే అప్పట్లో గొప్ప విజయం సాధించినట్టే. బహుశా, కొద్ది మినహాయింపులు తప్ప పలు భారతీయ భాషల సాహిత్యవేత్తలు, పాఠకులు ఈ పరిస్థితిని రిలేట్ చేసుకోగలరు అనుకుంటాను.అయితే, 202425 సంవత్సరాల్లో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023 వరకూ తెలుగులో అత్యధికంగా అమ్ముడుపోయిన పుస్తకాల కేటగిరీలో కొన్ని వేల కాపీలు అమ్ముడైన పుస్తకాలూ, ఆంగ్ల బెస్ట్ సెల్లర్ల తాలూకు అనువాదాలూ, కొన్ని దశాబ్దాల క్రితం నాటి క్లాసిక్స్ వంటివి ఉండడం పరిపాటి కాగా ఈ స్థితి 2024 నాటికి మారిపోయింది. ఐర్లాండ్‌లో స్థిరపడ్డ ఎన్నారై రవి మంత్రి రాసిన ఒక కొత్త ప్రేమకథాత్మక నవల 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' 2024 సంవత్సరంలోనే కొన్ని నెలల వ్యవధిలో వేగం పుంజుకుని లక్ష కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించింది. ఈ నవల ఇదే వేగాన్ని 2025లోనూ కొనసాగిస్తూ లక్షా డెబ్భై అయిదువేల కాపీలు అమ్ముడైంది. పైగా పుస్తకాలు పట్టుకోరన్న అభిప్రాయం ఉన్న యువతలోకి ఈ నవల చొచ్చుకుపోవడం చాలామంది సాహిత్యపరులకు ఆశ్చర్యకరంగా తోచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ నవల చదువుతున్నట్టు వీడియోలు చేయటం, చదివి రివ్యూలు పోస్ట్ చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. ఇన్ని పుస్తకాలు నిజంగా అమ్ముడు కావట్లేదని, ఇదంతా కేవలం మార్కెటింగ్ గిమ్మిక్ కావచ్చని ఈ పరిణామాన్ని చూసి సందేహపరులు అనుమానించారు. అయితే, జాతీయ స్థాయిలో అమెజాన్ ట్రెండ్స్‌లో యువల్ నోవా హరారీ, సుధామూర్తి, అరుంధతీ రాయ్ వంటివారి రచనలను, 'సైకాలజీ ఆఫ్ మనీ', 'అటామిక్ హాబిట్స్' లాంటి పుస్తకాలను దాటుకుని నెంబర్ 1 సెల్లర్‌గా నెలల పాటు నిలబడుతూ ఉండడమూ, చివరకు 2014లో అమెజాన్ ఇండియా ప్రకటించిన టాప్ 10 పుస్తకాల్లో రెండోస్థానంలో నిలవడమూ ఈ సందేహాలను పటాపంచలు చేశాయి. హైదరాబాద్ బుక్ ఫెయిర్, విజయవాడ బుక్ ఫెయిర్ వంటిచోట్ల కూడా ఈ పుస్తకాన్ని జనం కొనడమూ, రచయిత భారతదేశానికి తిరిగివచ్చినప్పుడు హైదరాబాద్‌లో జరిగిన వివిధ 'మీట్ ద ఆథర్' కార్యక్రమాలకు భారీ స్పందన రావడమూ వంటివి కూడా ఈ కొత్త పరిణామాన్ని కళ్ళకు కట్టాయి. రవి మంత్రి 2024లోనే ఆన్‌లైన్‌లో కాంటెంట్ క్రియేటర్‌గా, ఇన్‌ఫ్లుయెన్సర్‌గా విజయవంతం అవుతూ ఉండడంతో ఇదంతా కేవలం ప్రచారార్భాటం వల్ల జరిగిన ఒక వన్ ఆఫ్ పరిణామం అని తెలుగు సాహిత్యాన్ని దశాబ్దాలుగా గమనిస్తున్న చాలామంది కొట్టిపారేశారు. అయితే, యువ సాహిత్యకారులు కడలి సత్యనారాయణ రాసిన 'చిక్ లిట్', మహమ్మద్ గౌస్ రాసిన '826 కిమీ', ప్రసాద్ రామతోట రాసిన '90స్ లవ్‌స్టోరీ', శ్రీనివాస్ కాశెట్టి రాసిన 'అయోధ్య చేరిన కృష్ణ'... ఇవన్నీ కొన్ని నెలల వ్యవధిలోనే పదుల వేల కాపీలు దాటాయి. 'అమ్మడైరీలో కొన్ని పేజీలు' పుస్తకం లక్షన్నర కాపీలు అమ్ముడై సంచలనం సృష్టించడానికి ముందే వి. మల్లికార్జున్ 'ఇరానీ కేఫ్', సీతారామరాజు 'రామగ్రామ నుంచి రావణలంకకు' వంటి పుస్తకాలు కొద్ది నెలల్లోనే పలు రీప్రింట్లతో కొత్త పాఠకులను సంపాదించాయి. దీన్ని బట్టి కూడా ఇదేమీ హఠాత్తుగా రాత్రికి రాత్రి వచ్చిన పరిణామం కాదని అర్థమవుతుంది. మరోవైపు, వివిధ పబ్లికేషన్లు, ఆడియో బుక్స్ యాప్‌లు వంటివి కూడా అభివృద్ధి చెందుతున్నాయి (అజు పబ్లికేషన్స్, అన్వీక్షికి పబ్లిషర్స్, ఛాయ బుక్స్, ఎలమి పబ్లికేషన్స్ వంటి పబ్లిషింగ్ సంస్థలు, దాసుభాషితం వంటి ఆడియో బుక్స్ యాప్‌లు ఇందుకు ఉదాహరణ.). ఇన్‌స్టాగ్రామ్‌లో పుస్తకాల గురించి చర్చించి, వాటిని ప్రమోట్ చేసే బుక్‌ఫ్లుయెన్సర్లు ఈ పరిణామంలో ఒక కీలకమైన తోడ్పాటును అందిస్తున్నారు (తెలుగు కలెక్టివ్, ఆరుద్ర ఈశ్వర్, విముక్త సుధ వంటివారు ఇందుకు ఉదాహరణ). మొత్తంగా, ప్రభుత్వ ప్రోత్సాహం, పెద్ద సంస్థల మద్దతు, సినిమా ప్రముఖుల ప్రోత్సాహం... ఇవేమీ లేకుండా ఒక ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకని ఈ పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? ఎవరు కొంటున్నారు? ఎందుకు కొంటున్నారు? ఎలాంటి పుస్తకాలు అమ్ముడవుతున్నాయి? వంటి విషయాలపై అనక్‌డోటల్ రిఫరెన్సులు మినహాయిస్తే పరిశోధనలు కానీ, స్టడీలు కానీ పెద్దగా జరిగినట్టు కనిపించడం లేదు. ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో చేసిన ప్రచారం వల్ల పుస్తకాలు అమ్ముకోగలుగుతున్నారని విమర్శనాత్మకంగా రాస్తున్నవారు కూడా పాఠకులు ఎందుకు కొంటున్నారో,

## గిరిజన అభ్యున్నతిలో సమస్యలెన్నో!

దేశవ్యాప్తంగా గిరిజన జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ పదకొండో స్థానంలో ఉంది. రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వాల పరంగా ఎన్ని చర్యలు చేపడుతున్నా, అన్ని తెగలూ సమానంగా అభివృద్ధి చెందడం లేదు. దీంతో అంతర్గత అసమానతలు, అభివృద్ధిలో తారతమ్యాలు నెలకొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాల మేరకు అత్యంత వెనుకబడిన, ప్రత్యేక రక్షణ అవసరం ఉన్న చెంచులు, కోలాం, కొండరెడ్డి, తోటి వంటి నాలుగు తెగలను తెలంగాణలో ఆదిమ గిరిజన తెగలు (పి.వి.టి.జి)గా గుర్తించారు. ఇందులో చెంచులు నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో విస్తరించిన అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వీరి సంప్రదాయ వృత్తి వేట. అటవీ ఆధారిత జీవన విధానం నుంచి స్థిర వ్యవసాయానికి మార్పు చెందుతున్నారు. కలపయేతర అటవీ ఉత్పత్తులైన జిగురు, తేనె, కొండ చీపుర్ల సేకరణ వీరికి ప్రధాన ఆదాయ వనరులు. కొండరెడ్డి గిరిజనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి తీర అటవీ ప్రాంతాల్లో సాంప్రదాయకంగా పోడు వ్యవసాయం చేస్తున్నారు. వెదురు బుట్టలు, అలంకరణ వస్తువుల తయారీతో పాటు అటవీ కూలీ పని, మొక్కల పెంపకం వంటివి చేస్తారు. చింతపండు, తేనె, ఉసిరి వంటి ఉత్పత్తుల సేకరణ వీరి ప్రధాన జీవనోపాధి. తోటి తెగవారు ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. గోండులతో సంబంధాలున్న సాంస్కృతిక వాహకులుగా ప్రసిద్ధి. వంశపారంపర్యంలో భాగంగా పాటలు పాడతారు, సంప్రదాయ పచ్చబొట్టు వేస్తారు. వ్యవసాయంతోపాటు దినసరి కూలీ పనులు చేస్తారు. కొలాములు అనేవారు తోటీలు గోండులతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. పోడు వ్యవసాయం చేస్తూ, కొండచరియలపై చిరుధాన్యాలు, పప్పుదినుసులు మొదలైన పంటలను సాగుచేసేవారు. ఇప్పటికీ కొంతమంది పోడుసాగు చేస్తున్నా ఎక్కువగా స్థిర వ్యవసాయమే చేస్తున్నారు. వెదురు కళాకృతులు, బుట్టలు, చేపల వలలు, వ్యవసాయ సాధనాలు, నిల్వ పాత్రల తయారీ వీరి ముఖ్య ఉపాధి.

### క్షీణిస్తున్న జీవనోపాధులు

పీవీటీజీ తెగల వారు ఎక్కువగా వర్షాధారిత వ్యవసాయం, పోడు సాగు వంటి సంప్రదాయ పద్ధతులనే అనుసరిస్తున్నారు. నీటిపారుదల సదుపాయాల కొరత, భూ యాజమాన్యం పరిమితంగా ఉండటం వంటి సమస్యలు వారికి ప్రతికూలంగా నిలుస్తున్నాయి. అటవీ సంరక్షణ చర్యల వల్ల వేట, సేకరణ వంటి సంప్రదాయ జీవనోపాధులు క్షీణిస్తున్నాయి. భూ హక్కుల లోపంతో వ్యవసాయ అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆధునిక ఉపాధి అవకాశాలకు కావాల్సిన నైపుణ్యాలు, అనుభవం లేకపోవడం, వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సంప్రదాయ జీవనోపాధుల్లో అస్థిరత నెలకొంటోంది. ఆరోగ్య సదుపాయాలు లేకపోవడం, పోషకాహార లోపం, పేదరికం వేధిస్తున్నాయి. మిగిలిన వారితో పోలిస్తే ఆదిమ జాతి గిరిజన తెగల సగటు ఆయుర్దాయాలు తగ్గడంతో వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఆ తెగల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్నాయి. సమీకృత



గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా నివాసాలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, స్థిర వ్యవసాయం, ఉద్యాన వనాల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నారు. తెలంగాణ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ ద్వారా పశుపోషణ, వ్యవసాయం ఇతర చిన్న వ్యాపారాల కోసం ఆర్థిక సహకారం అందుతోంది. ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, గురుకుల నివాస విద్యాసంస్థల ద్వారా బాలబాలికలకు విద్య అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ పథకం ద్వారా సురక్షిత గృహాలు, శుద్ధమైన తాగునీరు, విద్య, ఆరోగ్యం, పోషకాహారం వంటి మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. రోడ్లు, టెలిఫోన్, విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యాలు. వన ధన్ వికాస కేంద్రాల పథకం ద్వారా అటవీ ఉత్పత్తుల విలువ వృద్ధి, శిక్షణ, మార్కెటింగ్ మద్దతు దక్కుతుంది. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా పోషక ఆహార లోపం తగ్గింపు, సీజనల్ ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, సంచార వైద్య ఆరోగ్య కేంద్రాల సేవలు అందిస్తున్నారు. ఏకలవ్య మోడల్ నివాస విద్యా సంస్థల ద్వారా గిరిజన బాలబాలికలకు చదువు చెబుతున్నారు. ఇంత చేస్తున్నా- తెలంగాణలోని ఇతర గిరిజన జనాభాతో పోల్చితే ఆదిమ గిరిజన తెగల్లో మానవ అభివృద్ధి సూచీల్లో గణనీయమైన వెనుకబాటుతనం కనిపిస్తోంది. వీరి సామాజిక, ఆర్థిక స్థితిని మెరుగుపరచడం, పేదరికాన్ని తగ్గించడం, సుస్థిర అభివృద్ధిని సాధించడం సమ్మిళిత ప్రగతికి తప్పనిసరి అవసరం.

### నైపుణ్య శిక్షణ అవసరం

ఆదిమ గిరిజన తెగల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కేంద్రీకృత, కమ్యూనిటీ ఆధారిత జీవనోపాధి కార్యక్రమాలను బహుముఖ వ్యూహంతో అమలు చేయాలి. ఆర్థిక స్వావలంబన కల్పించాలి. ఇందుకోసం ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, సాగునీటి వసతులు కల్పించాలి. నేల ఆరోగ్య పరిరక్షణ పద్ధతులకు సహకారం అందిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగును ప్రోత్సహించాలి. నైపుణ్యాధారిత సూక్ష్మ సంస్థలు, వ్యవసాయేతర ఉపాధులు, హస్తకళలు, ఆహార ప్రాసెసింగ్, గ్రామీణ సేవా రంగాల్లో జీవనోపాధికి వీలు కల్పించాలి. శాస్త్రీయ పద్ధతిలో అటవీ ఉత్పత్తుల సేకరణ, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, నిల్వ సదుపాయాలు సమకూర్చాలి. మార్కెటింగ్ సహకారం అందించాలి. ఆదిమ గిరిజన తెగల్లోని యువత, మహిళలకు నైపుణ్యాభివృద్ధి, వ్యాపారాభివృద్ధి శిక్షణ కల్పించాలి. తద్వారా సంప్రదాయ వృత్తులకు అతీతంగా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు చూపించాలి. స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాలు, ఉత్పత్తిదారుల సమూహాలు వంటి కమ్యూనిటీ సంస్థలను బలోపేతం చేసి, సమష్టి కొనుగోలు, విక్రయశక్తిని పెంచాలి. ఆర్థిక సేవలు, ప్రాథమిక వసతులు, సాంకేతికతలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలి. ఇలాంటి అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, రాష్ట్రంలో అత్యంత వెనుకంజలో ఉన్న 16,688 ఆదిమ గిరిజన తెగల కుటుంబాల సమగ్ర అభ్యున్నతి బాధ్యతను ప్రభుత్వం, సంబంధిత సంస్థలు స్వీకరించాలి. అప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడి ఇతర గిరిజన తెగలతో సమానంగా అభివృద్ధి సాధించగలుగుతారు.

## గ్రామీణ ప్రగతికి సాంకేతిక సాయం

ఆంధ్రప్రదేశ్‌లో విద్య, వైద్యం, వ్యవసాయం, ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ(ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను వినియోగించడానికి రాష్ట్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటోంది. ఆ దిశగా బిల్‌గేట్స్ ఫౌండేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం రాష్ట్ర భవిష్యత్తును మలుపుతిప్పే చారిత్రక పరిణామం. దీన్ని సమర్థంగా అమలులోకి తీసుకురావడంతో పాటు సాంకేతికతను సంస్థాగతం చేసి, జవాబుదారీతనాన్ని నెలకొల్పడం ద్వారా రాష్ట్రాన్ని రూపాంతరం చెందించడం తక్షణావసరం. కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతాలు రాష్ట్రాన్ని పాడిపంటలతో సస్యశ్యామలం చేస్తున్నాయి. చేపలు, రొయ్యల పెంపకం కేంద్రాలు, ఉద్యాన పంటలతో అలరారే ప్రాంతాలతో పాటు అనావృష్టి పీడిత ప్రదేశాలూ ఇక్కడ ఉన్నాయి. ఏపీలో సుమారు 85లక్షల హెక్టార్ల మేర సాగుకు అనువైన భూమి ఉన్నా- కోస్తాలో వరదలు, తుపానులు తీవ్ర నష్టాలను కలిగిస్తున్నాయి. సాగర తీరాలు కోతకు గురవుతున్నాయి. సముద్ర జలాల వల్ల నేల ఉప్పుదేరుతోంది. రాయలసీమలో అనావృష్టి, రొయ్యల చెరువులకు వైరస్‌లు, వ్యాధుల బెడద వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయి. దాంతో ఆయా కుటుంబాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా ప్రతికూల ప్రభావం పడుతోంది. ఈ వైపరీత్యాలను అధిగమించడం ద్వారా అధిక ఉత్పాదకతనూ, విస్తృత మార్కెట్లనూ సాధించాల్సి ఉంది. అందుకు తక్షణమే ఏఐ వంటి సాంకేతికతలను సమర్థంగా వినియోగించాలి.

### అధిక ఆదాయాల కోసం...

కృష్ణా-గోదావరి డెల్టాలో తుపానులు, అతివృష్టి, అనావృష్టి, కాలువలు పూడుకుపోవడం వంటి వైపరీత్యాలతో పంటల దిగుబడి దెబ్బతింటోంది. అందునా నష్టం సంభవించిన తరవాత ఆదుకోవడానికే ప్రాధాన్యమిస్తున్నారు తప్పితే, నష్ట నివారణపై దృష్టి సారించడం లేదు. ఇక్కడే 'ప్రెడిక్టివ్ ఎనలిటిక్స్' అక్కరకొస్తుంది. మునుపటి పరిస్థితులకు సంబంధించిన సమాచారం, ఏఐ, మెషిన్ లెర్నింగ్, స్టాటిస్టికల్ మోడలింగ్‌ల ద్వారా భావి పరిణామాలను అంచనావేసే పరిజ్ఞానమిది. ఉపగ్రహ సమాచారంతో వరద రాకడ, నష్టభయం గురించి ముందే అంచనావేసి ప్రజలను హెచ్చరించవచ్చు. ఇదంతా జిల్లాస్థాయిలో జరగాలి. మరోవైపు సెన్సర్లు, ఉపగ్రహాల సాయంతో నేలలో లవణీయతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, చవుడు భూములను సాగులోకి తీసుకురావాలి. మొబైల్ కెమెరాలు, డ్రోన్ల ద్వారా తెగుళ్లు, చీడపీడల ముప్పును ముందే గుర్తించి, ఏఐతో విశ్లేషించి రైతులకు తగిన పరిష్కారాలు సూచించాలి. ఏఐ, రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలను ఎంతగా సద్వినియోగం చేసుకుంటే రైతాంగానికి అంతగా మేలు చేయవచ్చు. ఏ వారానికి ఆ వారం సమాచారాన్ని సేకరించి వచ్చే నెలలో ఎదురుకాగల ముప్పును ముందుగానే గుర్తించి తగిన పరిష్కారాలతో సిద్ధం కావాలి. ఇలా ఏఐను మౌలిక వసతిగా ఉపయోగించడం ద్వారా తక్షణ లబ్ధి చేకూరేది చేపలు, రొయ్యల పెంపకం రంగానికే. దేశం నుంచి ఎగుమతి అయ్యే రొయ్యలు, చేపల్లో 34శాతం ఏపీ నుంచే ఉంటున్నాయి. కాబట్టి



రొయ్యల చెరువులను జాగ్రత్తగా కాపాడుకోవడం, ఆరోగ్యవంతమైన రొయ్యలను సాగు చేయడం పెంపకందారులతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకూ మేలు చేస్తుంది. రొయ్యల చెరువుల్లో నీరు కలుషితమైనా, రొయ్యలు తరచూ వ్యాధులకు గురైనా ఎగుమతి మార్కెట్ దెబ్బతింటుంది. గిరాకీ సైతం తగ్గిపోతుంది. దీన్ని నివారించడానికి ముందస్తు హెచ్చరికలు సరిపోవు. చెరువులోని నీటి నాణ్యతపై నిరంతరం నిఘా వేసి, తెగుళ్లను ముందే పసిగట్టే వ్యవస్థ కూడా ఉండాలి. తద్వారా కొనుగోలుదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవచ్చు. రొయ్యల నాణ్యత బాగోలేదని ఒకసారి మన ఆర్డర్లు రద్దయితే, దానివల్ల జరిగే నష్టం చాలాకాలం పాటు ఉంటుంది. దీన్ని నివారించడానికి 'ఆక్వా ఇంటెలిజెన్స్ గ్రిడ్' ఎంతగానో ఉపకరిస్తుంది. ఇక అనావృష్టి పీడిత రాయలసీమకు వేరుసెనగ వంటి వర్షాధార పంటలే ప్రధాన ఆదాయ వనరు. అవి దెబ్బతింటే రైతులపై రుణభారం పెరిగిపోతుంది. దాంతో వారు జీవనోపాధి కోసం వలసబాట పడతారు. దీన్ని నివారించేలా రాయలసీమ జిల్లాలకు ప్రత్యేకించిన వాతావరణ సమాచారం, నేలలో తేమ, నాట్లు వేయడానికి అనువైన సమయం వంటి వివరాలను ఏఐ సాయంతో రైతులకు వేగంగా తెలియజేయాలి. రుణాలు, బీమా క్లెయిమ్ సదుపాయాలను సకాలంలో అందించాలి. అర్హులను గుర్తించడానికి ఏఐ తోడ్పాటు తీసుకోవాలి.

### గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ

ఉత్తరాంధ్రలోని గిరిజన ప్రాంతాలు చిరుధాన్యాలు, కాఫీ, ఉద్యాన పంటలు, పసుపు, అటవీ ఉత్పత్తులకు నిలయాలు. డెల్టా ప్రాంతాల్లో అనుసరించే అభివృద్ధి వ్యూహానికి భిన్నమైన ప్రణాళికను ఇక్కడ అనుసరించాలి. స్థానికులకు నమ్మకమైన సమాచారం అందించాలి. గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ వసతులను విస్తరించాలి. పంట కోతల తరవాత వాటిల్లే నష్టాలను అరికట్టడానికి అగ్ర ప్రాధాన్యమివ్వాలి. శీతలీకరణ గిడ్డంగులు ఉన్నప్పటికీ... చేపలు, రొయ్యలు, పండ్లను వీలైనంత త్వరగా మార్కెట్లకు తరలించాలి. ఇందుకు అనువైన రూట్లు, మార్కెట్లో ధరలు తగ్గే ప్రమాదం, మంచి ధర పలికే సమయాల గురించి తెలియజేయడానికి ఏఐని ఉపయోగించాలి. సంబంధిత ప్రభుత్వ విభాగాలు, ఉత్పత్తిదారుల మధ్య సమర్థంగా సమన్వయం నెరపడం ద్వారా పై లక్ష్యాలను సాధించవచ్చు. కేవలం పైలట్ ప్రాజెక్టులతో సరిపుచ్చకుండా, అనుకున్నది సాధించడానికి సంస్థాగతమైన అండదండలు అవసరం. కాబట్టి, ప్రభుత్వం ఈ విషయంలో పూర్తి శ్రద్ధ తీసుకోవాలి. డెల్టా, ఆక్వాకల్చర్, మెట్ట ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత ప్రభుత్వ విభాగాలు కలిసికట్టుగా ప్రణాళికలు చేపట్టి ఏఐ సాయంతో వేగిరమే అమలు చేయాలి. డిజిటల్ పరిజ్ఞానాల సాయంతో నీటి కేటాయింపు, సరఫరా, శీతల గిడ్డంగుల నిర్వహణ, సకాలంలో సరకుల బట్వాడాలో సమస్యలను పరిష్కరించాలి. తెగుళ్ల ప్రమాదాన్ని ముందే పసిగట్టి నివారణ చర్యలు తీసుకోవడం, వాతావరణ మార్పులను తట్టుకునేలా రాష్ట్ర సాగు రంగాన్ని బలోపేతం చేయడం అత్యావశ్యకం. ఆ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ఉపయోగపడుతూ గ్రామీణాభ్యుదయానికి అమోఘ సాధనమవుతుందని ఆశిద్దాం.

## నాణ్యతతో రాజీ... ప్రజారోగ్యానికి ఏదీ పూచీ?

దేశంలో అత్యంత తీవ్ర పోటీ నెలకొన్న ప్రవేశ పరీక్షల్లో నీట్-పీజీ ఒకటి. ఏటా సుమారు రెండు లక్షల మంది ఎంబీబీఎస్ పూర్తి చేసిన యువ వైద్యులు ఈ పరీక్ష రాస్తుంటారు. ఇందులో మొత్తం 800 మార్కులకుగాను 200 ప్రశ్నలు అడుగుతారు. 'ప్రత్యేక వైద్య శిక్షణ'కు ప్రధాన ద్వారం వంటి నీట్-పీజీలో మంచి ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు ఏళ్ల తరబడి శ్రమిస్తుంటారు. అంతటి ప్రాధాన్యం ఉన్న పరీక్షలో కనీస అర్హతను సున్నాకు కుదించడం... మొత్తం ఎంపిక విధాన స్వరూపాన్నే ప్రభావితం చేయగల ప్రమాదముంది! నీట్-పీజీలో గతంలో జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 50వ పర్సంటైల్, ఇతర వర్గాల వారికి 40వ పర్సంటైల్ కనీస అర్హతగా ఉండేది. తద్వారా అభ్యర్థుల మౌలిక స్థాయి పరిజ్ఞానాన్ని నిర్ధారించేవారు. అయితే, 2022 నుంచి వరసగా ఈ కనీస అర్హతను కుదిస్తూ సున్నాకు తగ్గించారు. అంటే మార్కులు ఎంత తక్కువ వచ్చినా ప్రవేశ ప్రక్రియలో పాల్గొనే అవకాశం ఉంటుందన్న మాట. మరి 'కనీస అర్హత లేనప్పుడు ప్రవేశ పరీక్ష ఎందుకు?' అనే ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.

### పేద అభ్యర్థులకు లాభమేంటి?

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 52వేలకు పైగా పీజీ సీట్లు ఉన్నాయి. అందులో దాదాపు 27వేల సీట్లు ప్రైవేట్, డీమ్డ్ వైద్య కళాశాలల్లోవే. గడచిన సంవత్సరాల్లో 6-8 వేల వరకు పీజీ వైద్యవిద్య సీట్లు ఖాళీగా మిగిలిపోయిన సందర్భాలున్నాయి. అయితే, ఇవి ఎక్కువగా అధిక ఫీజులుండే ప్రైవేట్ సీట్లే కావడం గమనార్హం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో కీలక క్లినికల్ విభాగాలు మాత్రం పూర్తిగా నిండుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో పీజీ సీట్లు ఏ, బీ, సీ అనే విభాగాల వారీగా ఉంటాయి. ఏ-కేటగిరీ సీట్లను ప్రభుత్వం నిర్ణయించే ఫీజుతో మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తారు. బీ-కేటగిరీ సీట్ల ఫీజులు ఏడాదికి రూ.10-20 లక్షల వరకు ఉంటాయి. ఇక సీ-కేటగిరీ లేదా యాజమాన్య కోటా సీట్లలో చేరితే... కొన్ని క్లినికల్ కోర్సులు పూర్తయ్యేసరికి రూ.2-3 కోట్ల వరకు ఖర్చవుతుంది. మరి ఇలాంటి పరిస్థితుల్లో కనీస అర్హతను తొలగిస్తే అధిక ఫీజులు చెల్లించగలిగిన అభ్యర్థులు సీట్లు పొందడం సులభమవుతుంది. కానీ, బీ-కేటగిరీ ఫీజు కూడా భరించలేని ప్రతిభావంతులైన పేద అభ్యర్థులకు ఈ మార్పు వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు! ఒక పేద విద్యార్థి కాస్త మెరుగైన ర్యాంక్ సాధించినా, ఏ-కేటగిరీ సీటు రాకపోతే అతడి చదువు అక్కడితో ఆగిపోవచ్చు. అదే సమయంలో తక్కువ మార్కులు వచ్చిన ధనిక అభ్యర్థి సీ-కేటగిరీలో చేరగలుగుతాడు. ఇది వ్యక్తుల మధ్య పోలిక కాదు; వ్యవస్థలోని ఆర్థిక అసమానత గురించిన ప్రశ్న. మరో కీలక విషయం- 800 మార్కుల్లో 300 మార్కులు సాధించిన అభ్యర్థి, 120 మార్కులు సాధించిన అభ్యర్థి మధ్య విషయ పరిజ్ఞానంలో తేడా ఉంటుంది. అందుకోసమనే గతంలో కనీస అర్హతను చూసేవారు. ఇప్పుడా ప్రమాణం లేకపోవడం అభ్యర్థుల ఎంపిక నాణ్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇక్కడ అండర్ గ్రాడ్యుయేట్ వైద్యవిద్యను కూడా పరిశీలించాలి. దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో మెడికల్ కాలేజీలు ఉన్నాయి. శిక్షణ నాణ్యత అన్నిచోట్లా ఒకేలా లేదు. అధికారిక తనిఖీల్లో ఇది అనేక సార్లు వెలుగులోకి వచ్చింది కూడా. ఇలాంటి పరిస్థితుల్లో పీజీ ప్రవేశ పరీక్షకు కనీస ప్రమాణమంటూ ఉండాలి కదా? కానీ, అసలు ప్రమాణాన్నే పూర్తిగా తొలగించడం సమస్యను మరింత సంక్లిష్టం చేస్తుంది. పీజీ శిక్షణ అనేది వైద్యుడి జీవితంలో అత్యంత కీలకమైన దశ. జనరల్ మెడిసిన్, సర్జరీ, అనస్థీషియా వంటి విభాగాలు నేరుగా రోగుల ప్రాణాలతో సంబంధం ఉన్నవి. ఇక్కడ శిక్షణలో లోపం ఉంటే దాని ప్రభావం అంతిమంగా సమాజంపైనే పడుతుంది.

### ప్రభుత్వం పునరాలోచించాలి

దేశవ్యాప్తంగా సర్కారీ వైద్యుల పోస్టులు పెద్దసంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో 25-30శాతం పోస్టులు భర్తీ కాలేదు. నీట్-పీజీ సీట్లకు కనీస అర్హతను తొలగించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కాబోదు. వైద్యుల సంఖ్య పెరగడం అవసరమే కానీ, నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదు కదా? వైద్యవిద్య అనేది కేవలం డిగ్రీ కాదు. అది ప్రజల ఆరోగ్యం, ప్రాణాలతో ముడిపడిన బాధ్యత. ఈరోజు మనం తీసుకునే విధాన నిర్ణయం రేపటి వైద్యుల స్థాయిని నిర్ణయిస్తుంది. కాబట్టి కేంద్ర ప్రభుత్వం

# 24 గంటలూ కన్పించాల్సిన అవసరం నాకు లేదు - పీఆర్ కల్చర్‌పై శోభిత

బాలీవుడ్‌లో పీఆర్ వ్యవస్థ మరీ ఎక్కువైందని నటీనటులు కొన్ని రోజుల నుంచి అసహనం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. తరచూ ఇంటర్వ్యూల్లో దీనిపై అభిప్రాయాలు పంచుకుంటున్నారు. దీంతో ఈ అంశం బీటౌన్‌లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా నటి శోభిత ధూళిపాళ్ల పీఆర్ కల్చర్ గురించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. తనకు అలాంటివి ఏవీ అవసరం లేదన్న ఆమె.. అలాంటివి కొంతమందికే పనిచేస్తాయన్నారు.

ఇటీవలే 'చీకటిలో' అనే చిత్రంతో పలకరించిన శోభిత.. తాను ఈ చిత్రంలో నటించినందుకు ఎంతో ఆనందంగా ఉన్నట్లు చెప్పారు. "ఈ ప్రాజెక్ట్ గురించి విన్నప్పుడు కథ నచ్చి లోతుగా తెలుసుకోకుండానే అంగీకరించాను. షూటింగ్ ప్రారంభించిన తర్వాత బాగా కనెక్ట్ అయ్యాను. ఇందులోని కొన్ని సన్నివేశాల్లో చక్కని పదజాలం ఉపయోగించారు. భాషపై పట్టులేకపోతే అలాంటి డైలాగులు చెప్పడం చాలా కష్టం. తెలుగు నా మాతృభాష కాబట్టి ఎలాంటి డైలాగునైనా సులువుగా చెప్పగలిగాను. డబ్బింగ్ చెప్పేసమయంలో ప్రతి సన్నివేశాన్ని ఎంజాయ్ చేశాను" అని శోభిత అన్నారు.

ఇక ఇటీవల పెరిగిపోతోన్న పీఆర్ వ్యవస్థ గురించి శోభిత ప్రస్తావించారు. "నేను ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. ముంబయికి చెందిన నటిని కూడా కాదు. వైజాగ్ నుంచి వచ్చి ప్రతి చిన్న విషయాన్ని నేర్చుకుంటూ ఈ స్థాయికి వచ్చా. నాకు పీఆర్ వ్యవస్థ సెట్ కాదు. అందుకే నాకు దానిపై ఆసక్తి లేదు. 24 గంటలూ అందరికీ కనిపిస్తూ ఉండాలి.. అందరూ నా గురించి మాట్లాడుకోవాలి అని అనుకోను. పీఆర్ కల్చర్ కొంతమందికి పనిచేస్తుంది. అది పూర్తిగా వారి వ్యక్తిగత విషయం. నా సొంత విషయాలపై నాకు స్పష్టత ఉంది. ఇలాంటివి నాకు అవసరం లేదు" అని శోభిత అన్నారు. ఆమె తాజా చిత్రం 'చీకటిలో' అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.






# 26న ఉదయ్‌పూర్‌లో రష్మిక, విజయ్‌ల పెళ్లి

మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం

టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ- హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్థమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.

# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం



ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.

# ప్రమోషన్స్ పూర్తి చేసుకున్నాక టైటిల్ వివాదాలు




సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷-జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది. తండ్రీ కొడుకుల మధ్య సాగే ఈ ఎమోషనల్ డ్రామా ఫిబ్రవరి 20న కొత్త పేరుతో థియేటర్లలోకి రానుంది. చిన్న సినిమాలకు టైటిల్ అనేది బ్రాండింగ్‌లో కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి సమయంలో సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న నిర్మాతలకు భారంగా మారుతున్నాయి.

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.



# యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లిలో విషాదం....

## నీటి గుంతలో మునిగి గురుకుల పాఠశాల విద్యార్థి మృతి...

యాదాద్రి//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : యాదాద్రి భువనగిరి జిల్లా పగిడిపల్లి గ్రామంలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థి బాలఆకాశ్ (16) నీటి గుంతలో మునిగి మృతి చెందిన విషాద ఘటన సోమవారం చోటుచేసుకుంది. తోటి విద్యార్థి రెహమత్ ఖాన్‌తో కలిసి స్నానానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. సమాచారం ప్రకారం, పాఠశాల సమీపంలో ఉన్న నీటి గుంత వద్ద బాలఆకాశ్ స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా లోతులోకి జారి పోయాడు. ఈత రాకపోవడంతో బయటకు రావడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ప్రాణాల కోసం కేకలు వేస్తూ సహాయం కోరినా, అక్కడ ఉన్న తోటి విద్యార్థులు వెంటనే స్పందించినప్పటికీ అతన్ని కాపాడలేక పోయారు.తరువాత పాఠశాల సిబ్బంది, స్థానికులు కలిసి బాలుడిని బయటకు తీసి సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే వైద్యులు పరిశీలించి బాలఆకాశ్ ఇప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ఈ ఘటనపై బాలుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట రాస్తారోకో నిర్వహించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# కట్టంగూర్ పీహెచ్‌సీ సేవలు మెరుగు పరచాలి...

నల్గొండ//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యం అందించాలని కట్టంగూర్ సర్పంచ్ ముక్కాముల శ్యామల శేఖర్ అన్నారు. సోమవారం కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించి అక్కడ అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో పాటు వైద్య సిబ్బందిని అడిగి సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. ఔషధాల సరఫరా, సిబ్బంది హాజరు, శుభ్రత, రోగుల సౌకర్యాలపై వైద్యాధికారి శ్వేతతో చర్చించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.ఆస్పత్రిలో శుభ్రతను కచ్చితంగా పాటించడంతో పాటు తాగునీటి సదుపాయం కల్పించాలని ఆమె ఆదేశించారు. గ్రామ ప్రజలు ఆరోగ్య కేంద్ర సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే పట్టణాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న పీహెచ్‌సీలోనే చికిత్స పొందాలని సూచించారు.ఆస్పత్రి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ అత్తాపూర్‌లో

# అడ్వకేట్ మహ్మద్ ఖదీర్ దారుణ హత్య...

హైదరాబాద్//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పరిధిలో ఘోర ఘటన చోటు చేసుకుంది. అడ్వకేట్ మహ్మద్ ఖదీర్‌ను దుండగులు కత్తులతో దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం, సులేమాన్ నగర్‌లోని తన సొంత కార్యాలయంలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని ఖదీర్‌పై కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే కుప్పకూలిన ఖదీర్‌ను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి ఆధారాలు సేకరించారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ నిందితుల జాడ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.ఈ హత్యకు కుటుంబ విభేదాలే కారణమై ఉండొచ్చనే కోణంలో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బామ్మర్దుల పాత్రపై దృష్టి సారించి విచారణ కొనసాగిస్తున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.ఇటీవల చేవెళ్ల ప్రాంతంలో కూడా ఒక అడ్వకేట్ హత్యకు గురైన నేపథ్యంలో వరుస ఘటనలు న్యాయవాదుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. నిందితులను వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని న్యాయవాదుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సద్గురు సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు...

మహబూబాబాద్/ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రంలో లంబాడి సంక్షేమ సంస్కృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సద్గురు సంతు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మేదరి టోనీ, ఎస్ఐ బైరు గోపి, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, మాజీ సొసైటీ సభ్యుడు అడ్డగోడ ఐలయ్య, కేలోత్ రాములు తదితరులు పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బంజారా గిరిజనుల సామాజిక, సాంస్కృతిక పురోగతికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ గిరిజన సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య కొనసాగింది.

## కోరం లేక వాయిదాపడిన

# జహీరాబాద్ మున్సిపాలిటీ సమావేశం...



మెదక్//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం పలు మున్సిపాలిటీలలో అధికార స్థాపన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలలో అధికంగా కాంగ్రెస్ పార్టీ ఆధిపత్యం సాధించగా, కొన్ని ప్రాంతాల్లో హంగ్ పరిస్థితులు నెలకొన్నాయి.సోమవారం జరిగిన పాలకవర్గాల ఏర్పాటులో భాగంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని ఎమ్మెల్యే, ఎంపీ ఎక్స్అఫిషియో ఓట్ల సహాయంతో బీఆర్ఎస్ పార్టీ చేజిక్కించుకుంది. జిన్నారం మున్సిపాలిటీలో బీజేపీ కౌన్సిలర్ల మద్దతుతో బీఆర్ఎస్ పార్టీ అధికారం సాధించింది. నర్సాపూర్ మున్సిపాలిటీలో బీజేపీ మద్దతుతో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించగా, కోహిర్ మున్సిపాలిటీలో ఎంఐఎం మద్దతుతో కాంగ్రెస్ పార్టీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎక్స్అఫిషియో ఓటుతో కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకుంది.ఇదిలా ఉండగా జహీరాబాద్ మున్సిపాలిటీలో పాలకవర్గం ఏర్పాటుకు సంబంధించిన సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. అవసరమైన సంఖ్యలో సభ్యులు హాజరు కాకపోవడంతో అధికారికంగా సమావేశం నిర్వహించలేకపోయినట్లు అధికారులు తెలిపారు. తదుపరి తేదీని త్వరలోనే ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.మొత్తానికి ఉమ్మడి మెదక్ జిల్లాలో మున్సిపాలిటీలలో రాజకీయ పోటీ తీవ్రంగా కొనసాగుతుండగా, జహీరాబాద్ మున్సిపాలిటీలో అధికార స్థాపనపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది.ద

# స్వల్ప తేడాతో విజయం శాశ్వతం కాదు...

## ఫలితాన్ని తిరగరాస్తాం...ఎంపీ ధర్మపురి అరవింద్..



జామాబాద్,ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : నిజామాబాద్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ఫలితాలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు కలసి బీజేపీని ఓడించేందుకు అనైతిక పొత్తు పెట్టుకున్నాయని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆరోపించారు. సోమవారం జరిగిన మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన అధికార కాంగ్రెస్ పార్టీ తీరును తీవ్రంగా విమర్శించారు.నగర పాలక సంస్థలో సిద్ధాంతాలకు విరుద్ధంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయని అరవింద్ మండిపడ్డారు. బీజేపీని దెబ్బతీయాలనే లక్ష్యంతో ఈ మూడు పార్టీలు చేతులు కలిపాయని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కాయని ఆయన ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియలో కొందరు పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని కూడా ఆరోపించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అరవింద్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా-ఈ కారు రేసు వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కుటుంబాన్ని సీఎం ఎందుకు కాపాడుతున్నారని ప్రశ్నించారు. ఒక వైపు బిఆర్ఎస్‌పై విమర్శలు చేస్తూనే, మరోవైపు బిఆర్ఎస్ అభ్యర్థులను కాంగ్రెస్ వాహనాల్లో తీసుకురావడం వెనుక ఉన్న మర్మాన్ని ప్రజలకు చెప్పాలన్నారు. ఎంఐఎం పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ఫలితంపై స్పందిస్తూ, బీజేపీ అభ్యర్థి స్రవంతి రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి కేవలం మూడు ఓట్ల తేడాతో విజయం సాధించారని పేర్కొన్నారు. అలాగే ఎంఐఎం అభ్యర్థి బీజేపీ అభ్యర్థి బంటు రాముపై గెలవడంలో కాంగ్రెస్ వ్యూహం పనిచేసిందని ఆరోపించారు. ఈ ఫలితం తాత్కాలికమేనని, బాడీ గడువు పూర్తికాకముందే ఈ ఫలితాన్ని తిరగరాస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలో ఈ అక్రమ పొత్తులను ఎండగడతామని, ప్రజల తీర్పు మరోసారి తమవైపే ఉంటుందని అరవింద్ విశ్వాసం వ్యక్తం చేశారు. చివరిగా, ఎన్నికల్లో గెలుపొందిన మేయర్, డిప్యూటీ మేయర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# రాహుల్ గాంధీ ధోరణి మార్పు వచ్చిందా...



న్యూఢిల్లీ//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ ధోరణి ఎట్టకేలకు దారిన పడుతున్నట్లు భావించవచ్చునా. 202627వ సంవత్సరపు బడ్జెట్‌పై ఆయన సభలో ఈ నెల 11న చేసిన ప్రసంగాన్ని బట్టి ఈ ఆశాభావం కలుగుతున్నది. ఆయన నేరుగా బడ్జెట్ ప్రతిపాదనలను చర్చించి ఉండక పోవచ్చుగాక. లేదా మొత్తం మీద బడ్జెట్ తీరుతెన్నులను విశ్లేషించి మంచి చెడులను ఎత్తిచూపకపోవచ్చు. ఆ పని రానున్న రోజులలో కాంగ్రెస్ వక్తలు, ఇతర ప్రతిపక్ష వక్తలు చేయగలరు.కాని, దేశ ఆర్థికంతో సంబంధం గల అమెరికా వాణిజ్య ఒప్పందపు తీరు, అందువల్ల భారత దేశానికి కలిగే నష్టమంటూ తాను భావించే అంశాలను ప్రస్తావించారు. అది ప్రశంసించ దగిన విషయం. ఇక్కడ ఒక సందేహం కలగవచ్చు. ప్రతిపక్ష నాయకుని స్థానంలో ఉన్న వ్యక్తి చేయవలసిని పనే ఇది అయినపుడు తనను ప్రత్యేకంగా అభినందించటం ఎందుకని.ఎందుకంటే, రాహుల్ గాంధీ ఆ స్థానం నుంచి పార్లమెంటులో గాని, కాంగ్రెస్ నాయకునిగా బయట గాని తను చేయవలసిన పనులు అరుదుగా తప్ప చేయటం లేదు. చేయటం లేదన్న మాట స్వయంగా కాంగ్రెస్ వాదులకు, కాంగ్రెస్ నాయకత్వాన గల ప్రతిపక్ష కూటమి వారికి, అధికార పక్షమైన బిజెపికి, బయట సాధారణ ప్రజలకు కూడా అర్థమైంది. అందుకు అందరూ విసుగు పడుతుండగా బిజెపి సంతోషిస్తున్నది. ఆయన నాయకునిగా ఉన్నంతకాలం తమ అధికారానికి ముప్పు లేదని వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్‌లోనూ అసంతృప్తి పెరుగుతున్న స్థితిలో, పార్టీ నాయకునిగా రాహుల్‌ను తప్పించి ప్రియాంకకు బాధ్యతలు అప్పగించటం వల్ల ప్రయోజనం ఉండవచ్చుననే మాటలు ఇటీవల తిరిగి వినవస్తున్నాయి. మిగిలిన వారిని అట్లుంచి సాక్షాత్తూ ప్రియాంక భర్త రాబర్ట్ వాద్రా అటువంటి సూచన చేయటం తగినంత కలకలాన్ని సృష్టించింది. ఎవరైనా తాము చేయవలసినది చేయకుండా తక్కినవి ఎంత బాగా చేసినా దానిని లోకం మెచ్చదు. రాహుల్ అదే పని చేస్తూ వచ్చారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలనే ముందుగా తీసుకుంటే, ఆయన మాజీ సైన్యాధిపతి జనరల్ నరవణె రాసిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలతో భూకంపం సృష్టించాలని చూసారు. అందులో గల్వాన్ ఘటనల గురించిన ప్రస్తావన తప్పక చర్చించదగినదే. దానిపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నది మొదటనే స్పష్టమైంది. ఒక కారణం, అది ఇంకా అధికారికంగా వెలువడ లేదు. రెండవది, గల్వాన్ ఉదంతం సందర్భంగా 'ఏది ఉచితమని భావిస్తే అది చేయండి' (జో ఉచిత్ సమ్‌ఝే వో కరో) అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అప్పటి సైన్యాధిపతితో చెప్పారంటున్న మాటకు పలు విధాలైన నిర్వచనాలను వింటున్నాము. వాటిలో తను భావించిన నిర్వచనం ఏమిటో ఆ అధికారి పేర్కొనలేదు. ఇపుడు ప్రభుత్వమూ ఆ చర్చకు సిద్ధంగా లేదు. అటువంటి స్థితిలో రాహుల్ గాంధీ ఎంత సేపని, ఎన్ని రోజులని సభా సమయాన్ని అందుకోసం ఉపయోగించగలరు? విషయమేమంటే, ప్రతిపక్ష స్థానంలో కాంగ్రెస్ ఒక్కటే లేదు. వారి కూటమిలో, కూటమికి బయట ఇతర పార్టీలు కూడా ఉన్నాయి. నరవణె పుస్తకం విషయమై వారికి కూడా ఆందోళన ఉన్నా, సభా సమయం యావత్తూ రోజుల తరబడి అందుకే ఖర్చు కావటం వారికి నచ్చలేదు. తాము మాట్లాడదలచుకున్నవి తమకున్నాయి. పైగా ఇవి బడ్జెట్ సమావేశాలు. ఆ దృష్టా రాహుల్ ధోరణి వారికి నచ్చలేదని, అంతర్గతంగా ఆయనపై విమర్శలు మొదలయ్యాయని వార్తలు సూచించాయి. ఆయన బుధవారం నాడు నరవణె విషయం వదలి వేసి బడ్జెట్ గురించి మాట్లాడటానికి కారణం అదేనని భావించవలసి వస్తున్నది. వాస్తవానికి దేశానికి కావలసింది ప్రధానంగా బడ్జెట్ గురించిన చర్చ. 2020 నాటి గల్వాన్ గురించి నోటీసు ఇచ్చి మరొక సందర్భంలోనైనా చర్చించవచ్చు. బడ్జెట్ చర్చను ఆపి మరీ అందుగురించి చర్చించవలసిన అత్యవసర స్థితి ఏమీ లేదు. ఆ మాట రాహుల్ గాంధీకి స్వయంగా అర్థం కాలేదు. తన ధోరణిపట్ల ఇతర ప్రతిపక్షాల నిరసనతో బోధ పడింది. ఆ విధంగా ఆయన ధోరణీ ఆ వత్తిడి వల్ల దారిన పడిందన్న మాట. రాజ్యాంగ దుమారం విశేషమేమంటే తను గతంలోనూ ఇదే విధంగా వ్యవహరించారు కొన్ని సార్లు. తనకు సరైనదని తోచిన సంచలనాత్మక విషయమేదో ముందుకు తెస్తారు. దానిని ప్రస్తావించటంతో ఆగక రోజుల తరబడి సభలోనూ బయటా హంగామా సృష్టిస్తారు. ఇతర ప్రతిపక్షాలకూ, బయటి నుంచి టివిలలో చూసే ప్రజలకూ విసుగు తెప్పిస్తారు. ఇతర ప్రతిపక్షాల వత్తిడి మీదట ధోరణి మార్చుకుంటారు. ఆయనకు ఇదొక అలవాటుగా మారింది. మనం ఇరవై ఏళ్లుగా గమనిస్తున్న తన నాయకత్వంలోని అనేక లోపాలలో ఇది ఒకటి. సభలోనే కాదు. ఇతర విషయాలలోనూ అంతే. ప్రజల సమస్యలు, వారు తన నుంచి ఆశించేది ఒకటైతే, ఆయన మరేవో భుజాన వేసుకుంటారు. అవి ప్రజలకు పట్టవు. ఇటీవలి కాలానికేవస్తే, కాంగ్రెస్ అసెంబ్లీ సీట్లు మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్‌లలో గతం కన్న తగ్గింది ఎందుకు? ఆ కారణాలను ఆయన సమీక్షించుకున్నారో లేదో తెలియదు గాని, బయటి వారికి అర్థమవుతూనే ఉన్నాయి.

# కరీంనగర్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం చరిత్రాత్మకం....

## బీజేపీ మేయర్ ఉన్నచోట నిధులు ఆపితే వదిలేది లేదు....

## కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు హెచ్చరిక...



కరీంనగర్/ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం కావాలని, ప్రజల అభివృద్ధి విషయంలో రాజకీయాలను పక్కన పెట్టాలని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే లక్ష్యంతోనే తాము ఎన్నికల బరిలోకి దిగామని ఆయన పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రజల తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అంగీకరించకుండా కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తున్నారని ఆరోపించారు.కరీంనగర్ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం చరిత్రాత్మకమని ఇది దశాబ్దాలుగా ఉన్న ఆకాంక్ష నెరవేరినట్లేనని బండి సంజయ్ అన్నారు. ఎన్నో అడ్డంకులు, ఒత్తిళ్లు, కుట్రలు ఎదురైనా ప్రజలు ధర్మం వైపు నిలబడి బీజేపీకి మద్దతు ఇచ్చారని చెప్పారు. బీజేపీ బలపడుతుండటంతో కాంగ్రెస్ పార్టీ భయంతో తడబడుతోందని, ప్రజల మద్దతు కోల్పోయిన పార్టీలు కలసి రాజకీయ కుతంత్రాలు పన్నుతున్నాయని వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకు ఇచ్చిన మాట నిలబెట్టుకుని కరీంనగర్‌లో బీజేపీని గెలిపించామని, ఇప్పుడు నగర అభివృద్ధి కోసం కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులతో కలిసి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. మౌలిక వసతులు, రోడ్లు, కాలువలు, తాగునీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థ, విద్య, ఆరోగ్య రంగాల్లో కరీంనగర్‌ను ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు.బీజేపీ మేయర్ ఉన్న ప్రాంతానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా అడ్డుకుంటే సహించబోమని, అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని బండి సంజయ్ హెచ్చరించారు. ప్రజా అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వకపోవడం అంటే ప్రజలనే శిక్షించడమేనని, అలాంటి ధోరణిని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని అభివృద్ధికి సహకరించాలని కోరారు.బీఆర్ఎస్, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలన్నీ కలిసి ప్రజలకు ఏమి సాధించాయని ప్రశ్నించిన బండి సంజయ్, గతంలో ఈ పార్టీల పాలనలో నగర అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. ఎన్నికల్లో తాము గెలిచినా, మేయర్ పదవిని అడ్డుకోవడానికి మూడు పార్టీలు కలిసి కుట్రలు పన్నాయని, ప్రజల తీర్పును తారుమారు చేయడానికి ప్రయత్నించాయని ఆరోపించారు. అయితే ప్రజల ఆశీర్వాదంతో బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, ప్రజా సంకల్పం ఎప్పుడూ గెలుస్తుందని అన్నారు. కరీంనగర్ నగరానికి సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రమంత్రి స్థాయిలో చర్యలు తీసుకుంటామని, అవసరమైన చోట కేంద్ర సహకారం తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. నగర అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజకీయ వివక్ష ఉండకూడదని, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని బండి సంజయ్ పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు బీజేపీ కట్టుబడి ఉందని, కరీంనగర్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

# మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం...

## బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు గై హాజరు...

## మేయర్ గా మహంకాళి స్వామి...

## డిప్యూటీ మేయర్ గా పాతిపల్లి ఎల్లయ్య...





గోదావరిఖని//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం కొరకు రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 60 మంది సభ్యుల్లో సమావేశానికి హాజరైన 49 మంది వార్డు సభ్యులచే ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించిన జిల్లా పరిషత్ సిఇఓ నరేందర్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన 10 వ వార్డు సభ్యులు అడ్డాల గట్టయ్య ,40 వ డివిజన్ కార్పొరేటర్ కజంపురం జయప్రద తప్పా,మిగిలిన 11 మంది వార్డు సభ్యులు హాజరు కాలేదు. తెలుగు అక్షరమాల ప్రకారం 10 వ డివిజన్ కార్పొరేటర్ అడ్డాల గట్టయ్య మొదట ప్రమాణం చేయగా ఆఖరున 17 వ డివిజన్ అనుము స్వరూప ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం మేయర్ , డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 46 వ డివిజన్ కార్పొరేటర్ మహంకాళి స్వామి పేరును 9 డివిజన్ కార్పొరేటర్ తాళ్ళపెల్లి యుగంధర్ ప్రతిపాదించగా 38 వ డివిజన్ కార్పొరేటర్ నెలికంటి రాము బలపరిచారు.మరో ప్రతిపాదన రాక పోవడంతో మేయర్ పదవికి మహంకాళి స్వామి ఎన్నికైనట్టుగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఆ తరువాత డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రారంభమైంది. డిప్యూటీ మేయర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 57 వ డివిజన్ కార్పొరేటర్ పాతపెల్లి ఎల్లయ్య పేరును 30 వ డివిజన్ కార్పొరేటర్ ఇసంపల్లి అంజయ్య ప్రతిపాదించగా 31 వ డివిజన్ కార్పొరేటర్ షాహెదా బలపరిచారు.మరో ప్రతిపాదన రాకపోవడంతో డిప్యూటీ మేయర్ గా పాతపెల్లి ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. ఈ సమావేశంలో రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు , నగర పాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ ,ఎన్నికల పరిశీలకులు పద్మజా రాణి ,నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పర మావధిగా నూతన పాలకవర్గం పనిచేయాలి....

రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్...

ప్రజా సంక్షేమమే పరమావధిగా నూతన పాలక వర్గం పని చేయాలని రామగుండం నియోజకవర్గం శాసన సభ్యులు ,నగర పాలక సంస్థ ఎక్స్ అఫిషియో సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ సూచించారు.రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో సోమవారం నిర్వహించిన మేయర్ , డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాల పట్ల కార్పొరేటర్లు దృష్టి సారించాలని అన్నారు. పార్టీ విధేయత, సీనియారిటీ , అనుభవం ప్రాతిపదికన మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు అభ్యర్థులను అధిష్టానం ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. నిఖార్సయిన ప్రజా సేవకులు దొరికారని అన్నారు. పరిపాలనా సౌలభ్యం కొరకు జోన్ లుగా విభజించుకోవడం తప్పా ఎయిట్ ఇంక్ లైన్ కాలనీ,గోదావరిఖని, ఎన్టీపీసీ రామగుండం వేర్వేరు ప్రాంతాలు కాదని రామగుండం నగర పాలక సంస్థ పరిధి అంతా ఒకే ప్రాంతమని అన్నారు. పాలన ప్రజలకు మరింత చేరువ చేయడం కోసం 50 డివిజన్ ల నుండి 60 డివిజన్ లకు పెంచడం జరిగిందని అన్నారు. ఐకమత్యంతో పార్టీలకతీతంగా అన్ని డివిజన్ లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తమ పాలక వర్గం పని చేస్తుందని అన్నారు. రామగుండం లో జరుగుతున్న అభివృద్ధి విషయంలో ప్రజలు నిజం తెలుసుకొని కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రి శ్రీధర్ బాబు స్మార్ట్ జిల్లాగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే తలంపుతో పూర్తి సహకారం అందజేస్తూ నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మన రామగుండం నగరాన్ని వైద్య , విద్య,వ్యాపార , పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుకుందామని అన్నారు. అధికారులు , సిబ్బందితో ప్రేమగా వ్యవహరిస్తూ పనులు పూర్తి చేసుకోవాలని నూతన సభ్యులకు సూచించారు.

ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ నేతృత్వంలో నగరాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తాం...

నూతనగా ఎన్నికైన మేయర్ మహంకాళి స్వామి...

స్థానిక శాసన సభ్యులు ఎంఎస్. రాజ్ ఠాకూర్ నేతృత్వంలో రామగుండం నగరాన్ని ఇంకా బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తామని కొత్తగా ఎన్నికైన రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు.రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ప్రజా సేవలో ఉంటూ మూడు సార్లు కార్పొరేటర్ గా గెలిచి పార్టీకి విధేయుడుగా ఉన్నానని అన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వారి సతీమణి మనాలీ రాజ్ ఠాకూర్ తనను కుటుంబ సభ్యుడిగా భావించి ఆశీర్వదించడంతో పాటు మంత్రి వర్యులు శ్రీధర్ బాబు సహకారంతో రాజకీయంగా ఎదిగి మేయర్ పదవి చేపట్టగలిగానని అన్నారు.కష్ట పడి పని చేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు.దేశ విదేశాల్లోని నగరాలతో పోటీ పడే విధంగా మెట్రో నగరాలకు ధీటుగా రామగుండం నగరాన్ని అభివృద్ధి చేయాలని ఎం ఎల్ ఎ,కంకణం కట్టుకున్నారని అన్నారు.ఈ ప్రయత్నంలో తాము భాగస్వాములమవుతామని అన్నారు. తాను మేయర్ గా ఎన్నిక కావడానికి సహకరించిన కార్పొరేటర్లకు , ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.నగరంలో మురికి వాడల్లో అభివృద్ధి పనులు చేపట్టడం పై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని అన్నారు.నగరంలో అన్ని ప్రాంతాలకు రక్షిత మంచి నీటి సరఫరా,రోడ్లు,మురుగు నీటి కాలువలు అండర్ గ్రౌండ్ డ్రేనేజ్ అందుబాటులోకి తెచ్చే విధంగా పని చేస్తామని అన్నారు. తమ పని తీరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు తెస్తామని అన్నారు.

రామగుండం నగరపాలక అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది....

డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య...

ప్రగతి పథంలో ముందుకు దూసుకు వెళ్తున్న రామగుండం నగర అభివృద్ధిలో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య అన్నారు. సోమవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో కౌన్సిల్ హాల్ లో డిప్యూటీ మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాల్లో ఉండి చేసిన సేవలను , అనుభవాన్ని ఎం ఎల్ ఎ గుర్తించి ఎంతో నమ్మకంతో తనకు ఈ పదవి అప్పగించారని అన్నారు. పార్టీకి కట్టుబడి విధేయతతో పని చేసి ఆయన నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్,మేయర్ మహంకాళి స్వామి ఆద్వర్యంలో రామగుండం నగరాన్ని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు. తాను డిప్యూటీ మేయర్ కావడానికి సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజావాణిలో 5 ఫిర్యాదులు... భూమి తగాదాలు అధికం...

నాగర్ కర్నూల్//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఐదు ఫిర్యాదులు నమోదయ్యాయి. జిల్లాలోని పలు మండలాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులతో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సవివరంగా అడిగి తెలుసుకున్నారు.ఫిర్యాదులలో భూమి సంబంధిత తగాదాలు అధికంగా నమోదయ్యాయి. మొత్తం ఐదు ఫిర్యాదుల్లో మూడు భూమి వివాదాలకు సంబంధించినవిగా ఉండగా, మరో రెండు తగు న్యాయం కోసం వచ్చినవిగా అధికారులు తెలిపారు. ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా విన్న ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులకు కేసులను ప్రాధాన్యతతో తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలను నేరుగా వినేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిడ

## మూడు మున్సిపాలిటీలను కైవసం చేసుకున్న కాంగ్రెస్...



మక్తల్//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : వనపర్తి జిల్లాలోని మక్తల్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. నియోజకవర్గ పరిధిలోని మక్తల్, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీలలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను కాంగ్రెస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలుచుకుని పార్టీ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.మక్తల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌గా వాకిటి మానస హన్మంతు, వైస్ చైర్‌పర్సన్‌గా శైవీ రెడ్డి ఎన్నికయ్యారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌గా నాగమణి, వైస్ చైర్‌పర్సన్‌గా నల్లగొండ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టనున్నారు. అమరచింత మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌గా జింక సువర్ణ, వైస్ చైర్‌పర్సన్‌గా రాధా అరుణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల ఫలితాలతో నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని మరింతగా పెంచుకుంది. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లకు రాష్ట్ర క్రీడా, పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుభాభినందనలు తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించాలని, పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన సూచించారు.మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు సోమవారం నాడు ఘనంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా

## మహబూబ్ నగర్ కార్పొరేషన్....

### కాంగ్రెస్ విజయంపై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హర్షం...



జడ్చర్ల//ఫిబ్రవరి 16(ఆకాంక్ష) : మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను కాంగ్రెస్ పార్టీ కైవశం చేసుకోవడం పట్ల జడ్చర్ల ఎమ్మెల్యే, కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జి జనంపల్లి అనిరుధ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కు మహబూబ్ నగర్ ప్రజల తరపున కానుకగా అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు టి. మమత మేయర్‌గా, సురేందర్ రెడ్డి డిప్యూటీ మేయర్‌గా ఎన్నిక కావడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయడం కారణమని, ముఖ్యంగా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన అనేకమంది నాయకులు అన్ని డివిజన్లలో విస్తృతంగా ప్రచారం చేసి పార్టీకి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.ఈ సందర్భంగా కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. పదవుల కోసం ఆశపడి అవకాశాలు రాక నిరాశ చెందిన వారు ఎవరైనా ఉంటే, వారి విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.కొత్తగా ఎన్నికైన మేయర్ మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మహబూబ్ నగర్ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా నూగిల్ల మల్లయ్య...

### వైస్ చైర్‌పర్సన్‌గా ముస్కాన్ నాజ్ ఏకగ్రీవ ఎన్నిక...





పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో 21వ వార్డు కౌన్సిలర్ నూగిల్ల మల్లయ్య మున్సిపల్ చైర్మన్‌గా, 36వ వార్డు కౌన్సిలర్ ముస్కాన్ నాజ్ వైస్ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. చైర్మన్, వైస్ చైర్‌పర్సన్ పదవులకు ఇతర అభ్యర్థుల నుంచి నామినేషన్లు దాఖలు కాకపోవడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన వెల్లడించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు నియామక పత్రాలను అందజేశారు.మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు నరేష్, వినయ్, కిరణ్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్, టీఓటీ కృష్ణారెడ్డి మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ నూగిల్ల మల్లయ్య, వైస్ చైర్‌పర్సన్ ముస్కాన్ నాజ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. నూతన పదవులకు ఎన్నికైన వారికి తోటి కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.

### యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ...



మంథనిరూరల్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : మంథని రూరల్ పరిధిలోని ముత్తారం మండల కేంద్రంలో సోమవారం యాదవ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమానికి అఖిల భారత యాదవ మహాసభ ముత్తారం మండల అధ్యక్షులు కాసు తిరుపతి యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భంగా మండల యువత అధ్యక్షులు చెల్కల యుగేందర్ యాదవ్, యాదవ సంఘం నాయకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ యాదవ సంఘం ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణ లక్ష్యంగా సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, సేవా రంగాలలో సంఘం మరింత ముందుకు సాగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మారేడుగొండ రాజన్న, బక్కతట్ల కుమార్, మండల ప్రధాన కార్యదర్శి, కేషనపల్లి ఉపసర్పంచ్ సింగనవేన సదయ్య, యాదవ సంఘం నాయకులు నూనేటి కృష్ణ, తాత పోచమళ్ళు, రవికుమార్, మారేడుగొండ సమ్మయ్య, టి. తిరుపతి, పెద్దరాజమల్లు, కిరణ్, రాజశేఖర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో సీఎం కప్ అథ్లెటిక్స్ పోటీలు...

### గాయత్రి విద్యానికేతన్ విద్యార్థుల బంగారు విజయం...



పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌లో నిర్వహించిన సీఎం కప్2025 జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభతో మెరిసి బంగారు పతకాలను సాధించారు. జావెలిన్ త్రో విభాగంలో కె. తనీష్ బంగారు పతకం సాధించగా, 100 మీటర్ల పరుగులో ఏ. సాయి చరణ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకుని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ విజయంతో ఇద్దరు విద్యార్థులు ఈ నెల 19 నుండి 24 వరకు హనుమకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పెద్దపల్లి జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ విద్యార్థులను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పెద్దపల్లి జిల్లాకు కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్ కుమార్ తదితరులు విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్....

### డిప్యూటీ మేయర్ ఎన్నికలకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు...



గోదావరిఖని//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : పెద్దపల్లి జిల్లా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో నగరంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగేందుకు మున్సిపల్ కార్యాలయం వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ ఏర్పాట్లను పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్‌లు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని విధాలుగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సజావుగా జరిగేలా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఏ విధంగానూ సహించబోమని హెచ్చరించారు. జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలలో కూడా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఈ భద్రతా ఏర్పాట్లలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌తో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల రోజు ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

### శాతవాహన యూనివర్సిటీ ఫలితాల్లో

## 'గాయత్రి' విద్యార్థుల ప్రభంజనం...




పెద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన మొదటి సెమిస్టర్ ఫలితాల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. బీకాం, బీఎస్సీ విభాగాలకు చెందిన విద్యార్థులు అత్యధిక ఎస్జీపిఏ సాధించి యూనివర్సిటీ స్థాయిలో ముందంజలో నిలిచారు.ఈ ఫలితాల్లో పూదరి దుర్గ భవాని (బిటిబిసి) 9.16 ఎస్జీపిఏతో అగ్రస్థానంలో నిలిచింది. ముత్యాల సౌమ్య (బిజెడ్‌సి) 9.12, పుట్ట అక్షయ (ఎంఎస్టీడిఎస్) 9.04, అప్పని లక్ష్మీ ప్రసన్న (ఎంఎస్టీడిఎస్) 9.00 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. వీరితో పాటు పూదరి హాసిని (8.84), బాతుల సుసన్య (8.72), పుట్ట అశ్విత (8.72), సిద్ధ సౌమ్య (8.68), మెరుగు కావ్య శ్రీ (8.64), పొన్నం సాయి లక్ష్మి (8.64), సౌదా బేగం (8.60)అత్యుత్తమ మార్కులు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. మొత్తం 22 మంది విద్యార్థులు 8.0 కంటే ఎక్కువ ఎస్జీపిఏ సాధించడం విశేషంగా నిలిచింది.విజయం సాధించిన విద్యార్థులను కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్ అభినందిస్తూ, క్రమశిక్షణతో చదివి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ జె. రవీందర్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం విద్యార్థులకు మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ విజయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అంకితం చేస్తూ మరింత కృషి చేస్తామని తెలిపారు.

## వేముల గ్రామంలో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం....



దుర్ల//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జడ్చర్ల నియోజక వర్గంలోని మిడ్జిల్ మండలం వేముల గ్రామంలో శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ శివాంజనేయ దేవాలయ ప్రాంగణంలో 30వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ చర్లకోల లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన శివపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి, గ్రామ ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణకు తాను ఎప్పటికీ సహకారం అందిస్తానని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే బండలగుడు పోటీకి ఈ ఏడాది కూడా ఒక లక్ష రూపాయల నగదు బహుమతిని అందజేస్తూ తన అనవాయితీని కొనసాగించారు. కార్యక్రమం ముగింపులో దేవాలయ కమిటీ సభ్యులు లక్ష్మారెడ్డిని శాలువాతో సత్కరించి, గుర్తుగా శీల్డ్‌ను అందజేశారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.మహోత్సవం సందర్భంగా గ్రామం మొత్తం భక్తి వాతావరణంలో మునిగిపోయి, శివనామస్మరణతో మార్మోగింది. భక్తులకు అన్నదానం నిర్వహించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## గెలుపు 'సింహం'.. ప్రజా సేవలో సంపత్...



ఎద్దపల్లిటౌన్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : పెద్దపల్లి మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్‌గా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి కొలిపాక సంపత్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 'సింహం' గుర్తుపై పోటీ చేసి విజయం సాధించిన ఆయన, సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు.ప్రమాణ స్వీకారం అనంతరం మీడియాతో మాట్లాడిన సంపత్, తన గెలుపుకు సహకరించిన 18వ వార్డు ఓటర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల ఏర్పాటు, అంతర్గత రోడ్ల అభివృద్ధి వంటి ప్రాథమిక అవసరాలను త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.వార్డు ప్రజలకు ఏ సమస్య వచ్చినా 24 గంటలు అందుబాటులో ఉంటాను. ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులకు చేరేలా కృషి చేస్తూ, 18వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. సింహం గుర్తుపై గెలుపు సాధించిన సంపత్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరపున బలమైన అభ్యర్థిగా నిలిచి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్నారు.సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటే ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో 18వ వార్డు ప్రజలు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సంపత్‌కు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

## హైదరాబాద్ లో 63 మంది ఇన్స్‌పెక్టర్ల బదిలీ....




హైదరాబాద్//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : హైదరాబాద్ నగర పోలీసు వ్యవస్థలో పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న 63 మంది ఇన్స్‌పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి సి సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ బదిలీలలో భాగంగా ఎస్‌బి విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు అధికారులను స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగా (ఎస్‌హెచ్ఓలు) నియమించారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న రాంబాబు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ రెడ్డి, రుక్మిణీ, రాజగోపాల్ రెడ్డిలకు ఎస్‌హెచ్ఓ బాధ్యతలు అప్పగించారు.అలాగే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్ఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్ రెడ్డిని ఎస్‌బి విభాగానికి బదిలీ చేసి, ఆయన స్థానంలో శ్రీనివాసులు రెడ్డిని నియమించారు.నగర పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, శాంతిభద్రతల పరిరక్షణలో వేగవంతమైన చర్యలు తీసుకోవడం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

### కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్

## మేయర్ ఎన్నికపై వీడిన ఉత్కంఠ..!

### తొలి మేయర్ గా సిపిఐ అభ్యర్థి మూడ గణేష్ నియామకం...



కొత్తగూడెం//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొలువు దీరిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికపై వీడిన ఉత్కంఠ! భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాజకీయ సందడి నెలకొంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో నూతన అధ్యాయం మొదలైంది. సోమవారం నూతనంగా ఎన్నికైన 60 మంది కార్పొరేటర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఇప్పటికే కాంగ్రెస్, సిపిఐ మేయర్ పీఠం చెరో రెండున్నరేళ్ల కు ఒప్పందం కుదుర్చుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్ లో తొలుత రెండున్నరేళ్ల తొలి మేయర్ గా సిపిఐ అభ్యర్థి మూడ గణేష్ నియామకం జరిగింది. డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ అభ్యర్థి 8వ డివిజన్ లో విజయం సాధించిన సిరిపురపు లలిత ను ఖరారు చేశారు. ఈ కీలక ఘట్టంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపి రామసాయం రఘురాం రెడ్డి, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్వయంగా రంగంలోకి దిగారు. తమ పార్టీల తరపున గెలుపొందిన అభ్యర్థులను వెంటబెట్టుకొని వారు కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు.కూటమి అభ్యర్థుల్లో ధీమా నింపుతూ, మేయర్ పీఠాన్ని దక్కించుకునే దిశగా వ్యూహ ప్రతివ్యూహాలతో వారు ముందుకు సాగుతున్నారు. బిఆర్ఎస్ అభ్యర్థుల గైర్హాజరు కాగా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత రాష్ట్ర సమితి కి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరు కావడం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వీరు కావాలనే దూరంగా ఉన్నారా లేదా ఇతర రాజకీయ సమీకరణాలు ఏవైనా ఉన్నాయా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. వీరి గైర్హాజరు మేయర్ ఎన్నిక ఫలితంపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ప్రమాణ స్వీకారోత్సవం నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. అభ్యర్థుల ప్రమాణ స్వీకారం ముగిసిన వెంటనే మేయర్, డిప్యూటీ మేయర్ల ఎంపిక ప్రక్రియ మొదలు కానుంది. ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టాత్మకమైన ఈ పీఠం కోసం ప్రయత్నిస్తుండటంతో కొత్తగూడెం రాజకీయాలు వేడెక్కాయి.

## విదేశీ మహిళపై అత్యాచారం..

### ముగ్గురు నిందితులకు న్యాయస్థానం మరణశిక్ష...




బెంగళూరు//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : విదేశీ మహిళపై అత్యాచారం కేసులో కర్ణాటక కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ముగ్గురు నిందితులకు న్యాయస్థానం మరణశిక్ష విధించింది. ప్రపంచ వారసత్వ ప్రదేశమైన హంపి సమీపంలో గతేడాది మార్చి 6న జరిగిన ఇజ్రాయెల్ మహిళపై అత్యాచారం, అమెరికన్ పర్యాటకుడి హత్య కేసులో ముగ్గురు దోషులకు కర్ణాటకలోని గంగావతి కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పు ప్రకటించింది. ఫిబ్రవరి 6న, మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు.. మల్లేష్ అలియాస్ హండిమాల్, సాయి, శరణప్ప అనే ముగ్గురు నిందితులను దోషులుగా నిర్ధారించింది. ఫిబ్రవరి 16న శిక్షను ప్రకటిస్తూ.. న్యాయమూర్తి సదానంద నాగప్ప నాయక్ ముగ్గురు దోషులకు మరణశిక్ష విధించారు.

### పరిపాలనలో వేగాన్ని, వ్యాపార

## సౌలభ్యాన్ని అందిస్తోన్న ఆర్టిజిఎస్ చంద్ర బాబు



అమరావతి//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : పరిపాలనలో వేగాన్ని, వ్యాపార సౌలభ్యాన్ని ఆర్టిజిఎస్ అందిస్తోందని ఏపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. మానవజీవనాన్ని మెరుగు పరిచేందుకు సేవ చేయాలన్నదే తమ లక్ష్యం అని అన్నారు. ఏపి సచివాలయంలో సిఎంతో కలిసి ఆర్టిజిఎస్ కేంద్రాన్ని మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ సందర్శించారు. ఆర్టిజిఎస్ కేంద్రం నుంచి పరిపాలనలో టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించారు. డేటాలేక్, అవేర్ 2.0 వాట్సప్ గవర్నర్ ను, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మీడియాతో మాట్లాడారు. ప్రత్యక్షంగా ప్రజల జీవితాల్లో ఆర్టిజిఎస్ మార్పు తీసుకువస్తోందని, 1990లో బిల్ గేట్స్ ను కలిసినప్పుడు సాంకేతికపై స్ఫూర్తి వచ్చిందని తెలియజేశారు. సాంకేతికత ద్వారా పౌర సాధికారత సాధ్యమనే స్ఫూర్తి వచ్చిందని, నాటి ఆలోచనలే ఈనాటి టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు బాటలు వేశాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆర్టిజిఎస్ ద్వారా ఇవాళ పలు కార్యక్రమాలను ప్రదర్శించడం సంతోషంగా ఉందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

### ప్రమాదానికి గురైన యువకుని

## వెస్సో రూ.81 వేల ఆర్థిక సహాయం...



తాడేపల్లిగూడెం//ఫిబ్రవరి 16 ఆకాంక్ష : తాడేపల్లిగూడెం,తాళ్లముదునూరుపాడు గ్రామము నకు చెందిన సింహాద్రి వినయ్ కుమార్(20) ప్రతిభావంతుడైన పేద విద్యార్థి. అతను 10వ తరగతిలో 600కి 520 మార్కులు సాధించి, ప్రస్తుతం మెరిట్ స్కాలర్‌షిప్ తో పాలిటెక్నిక్ లో ఎలక్ట్రికల్ డిప్లొమా ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కుటుంబ పోషణకు తండ్రి చిట్టిబాబు బీరువాల తయారీ సంస్థ లో మరియు తల్లి పేపర్ ప్లేట్స్ తయారు చేసే సంస్థలో దినసరి వేతనాలకు పని చేస్తున్నారు. దురదృష్టవశాత్తు, ఈమధ్య వినయ్ హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై (వెనుక కూర్చుని) వెళ్తున్న సమయంలో వేరొక బైక్ గుద్దుకొన్న రోడ్డు ప్రమాదంలో, తల మరియు కడుపు భాగాల్లో తీవ్రమైన గాయాలు అయ్యాయి. వెంటనే సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి, అత్యవసరంగా కడుపు కు శస్త్రచికిత్స చేశారు.అయితే, సరైన చికిత్స అందకపోవడంతో, అతని ఆరోగ్యం మరింత క్షీణించి, పక్షవాతానికి గురి అయ్యారు. పూర్తిగా కోలుకోక పోవడంతో, ప్రస్తుతం అతనిని విశాఖపట్నం లోని కింగ్ జార్జ్ ఆసుపత్రి లో చేర్పించారు. ప్రస్తుతం అక్కడ అతనికి మరో శస్త్రచికిత్స జరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స ఉచితంగా జరుగుతున్నప్పటికీ,మందులు, పౌష్టికాహారం, ప్రయాణం, బస, తదితర ఖర్చులు కుటుంబానికి భారంగా పరిణమించాయి! ఇప్పటి వరకు బంధువులు, స్నేహితుల సహాయంతో రెండున్నర లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. ఇకపై మరింత ఖర్చు భరించే స్థితిలో వారి కుటుంబం లేదు! ఈ పరిస్థితిలో, స్థానిక సంఘ నాయకుల ద్వారా, వినయ్ కుమార్ వైద్య చికిత్స కొనసాగింపునకు ఆర్థిక సహాయం అందించమని తండ్రి చిట్టిబాబు వెస్సో ట్రస్ట్‌ను ఆశ్రయించారు. వెస్సో ట్రస్టీలు గౌరవ దాతల సహకారంతో వినయ్ తల్లి ఈశ్వరికి 81,200 రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ, ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉండి, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్న పేద విద్యార్థి వినయ్ వైద్యానికి మద్దతు ఇచ్చిన గౌరవ దాతలకు పేరుపేరునా ధన్యవాదములు తెలిపారు. నిధి సేకరణకు విశేషంగా మద్దతు ఇచ్చిన రాజమహేంద్రవరం అర్బన్ విశ్వబ్రాహ్మణ సంఘం వారికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.